# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ | మంగళవారం 10-8-2021 | RNI No.52865/93-Postal No\.H/SD/258/2020-2022 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :28 | సంచిక: 7 | పేజీలు:4 | వెల: రూ.1/-


## మోదీ బొమ్మతోనే ఉచిత రేషన్ పంపిణీ: నిర్మలా

న్యూఢిల్లీ, ఆగష్టు 9:ంషన్ దుకాణాల వద్ద ప్రధాని మోదీ ఫొటో ఎందుకు ఉంచలేదని కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రశ్నించారు. 'ప్రధానమంత్రి గరీబ్ కల్యాణ్ అన్న యోజన' ద్వారా అందజేస్తున్న ఉచిత బియ్యం పంపిణీ సమయంలో ప్రధాని మోదీ బొమ్మతో కూడిన బోర్డు తప్పనిసరిగా ఉండాల్సిందేనని స్పష్టం చేశారు. కేంద్రం ఉచితంగా బియ్యం ఇస్తోందనే విషయం ప్రజలకు తెలియజేయాలన్నారు. విశాఖపట్నం జిల్లా కశింకోట మండలం తాళ్లపాలెం రేషన్ డిపోను కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ పరిశీలించారు. " రేషన్ దుకాణాల వద్ద ప్రధాని మోదీ ఫొటో ఎందుకు ఉంచలేదు? కేంద్రం 'గరీబ్ కల్యాణ్ అన్న యోజన' పథకం కింద బియ్యం ఉచితంగా పంపిణీ చేస్తోందన్న సమాచారం ప్రజల్లోకి వెళ్లిందా?" అంటూ నిర్మలా సీతారామన్? అధికారులు, రేషన్ డీలర్‌పైన ఆగ్రహం వ్యక్తం చేశారు. మే, జూన్‌లో ప్రధాని ఫొటో లేకుండానే బియ్యం పంపిణీ చేయడమేంటని మంత్రి ప్రశ్నించారు. కేంద్రం వాటా రేషన్ దుకాణాల వద్దే ఇవ్వాలని తెలిపారు. ఇచ్చేటప్పుడు అన్ని దుకాణాల్లోనూ పీఎంజీకేఏవై బోర్డులు ప్రదర్శించాలని అధికారులను నిర్మలా ఆదేశించారు. ప్రధానమంత్రి గరీబ్ కళ్యాణ్ అన్న యోజన మొదటి దశ, రెండవ దశ(ఏప్రిల్-నవంబర్ 2020) కింద ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఇప్పటివరకు 2.61 కోట్ల మంది లబ్ధిదారులకు 9.95 లక్షల మెట్రిక్ టన్నుల ఆహారధాన్యాలు అలాగే 90.3 లక్షల లబ్ధిదారులకు 66,492 మెట్రిక్ టన్నుల పప్పుధాన్యాలు అందించినట్లు నిర్మలా వివరించారు.

## జస్టిస్ కేశవరావుకు నివాళులర్పించిన మంత్రి అల్లోల



హైదరాబాద్ , ఆగష్టు 9: జూబ్లీహిల్స్‌లోని మహాప్రస్థానంలో జరుగుతున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పి. కేశవరావు అంత్యక్రియలకు న్యాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి హాజరయ్యారు. కేశవ రావు పార్థివదేహంపై పుష్పగుచ్ఛం ఉంచి శ్రద్ధాంజలి ఘటించారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. కాగా, మత్రులు ఎర్రబెల్లి దయాకర్ రావు, వేముల ప్రశాంత్ రెడ్డి కేశవరావు మృతి పట్ల తమ సంతాపం ప్రకటించారు. వారి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు.

## ఆదివాసీల అభివృద్ధికి నిరంతరం కృషి : మంత్రి సత్యవతి




హైదరాబాద్ , ఆగష్టు 9:గత ప్రభుత్వాలు ఆదివాసీలను ఓటుబ్యాంకుగా చూసి రాజకీయాలు చేస్తే, గత ఏడేళ్లుగా ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణలో ఆదివాసీల సంస్కృతి పరిరక్షిస్తూ, సంక్షేమానికి పాటుపడుతూ, అభివృద్ధిలో భాగస్వామ్యం చేస్తున్నామని రాష్ట్ర గిరిజన, స్త్రీ ? శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ గారు పేర్కొన్నారు.

అటవీ బిడ్డల జీవన విధానానికి ప్రతీకగా, అడవితో తాము మమేకమైన అనుబంధాన్ని గుర్తు చేసే విధంగా హైదరాబాద్ వేదికగా ప్రపంచ ఆదివాసీ దినోత్సవం ఘనంగా జరిగిందన్నారు.

మాసబ్ ట్యాంకులోని దామోదర సంజీవయ్య సంక్షేమ భవన్‌లో ఆదివాసీల గుస్సాడి, దింసా నృత్యాలతో కోళాహలంగా, కన్నుల పండుగగా జరిగింది.

స్థానిక ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మిరాజ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి సత్యవతి రాథోడ్, ప్రత్యేక అతిథులుగా ఎమ్మెల్సీ ఎంఎస్ ప్రభాకర్ రావు హాజరయ్యారు.

ఈ సందర్భంగా మంత్రి సత్యవతి రాథోడ్ మాట్లాడుతూ.. ఆదివాసీలందరికీ ప్రపంచ ఆదివాసీ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

ఆదివాసీల జీవన ప్రమాణాలను పెంచేందుకు కేసీఆర్ నాయకత్వంలో పని చేస్తున్నామని పేర్కొన్నారు. ఆదివాసీల అభివృద్ధికి అనేక కార్యక్రమాలు చేపట్టామన్నారు.

గడిచిన ఏడేండ్లుగా గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అందరికీ సమానంగా సంక్షేమ పథకాలు అందివ్వాలని ప్రయత్నం జరుగుతుంది అని మంత్రి తెలిపారు.

గిరిజనులు రాష్ట్రంలో దాదాపు 10 శాతం ఉన్నారు. మా తండాలు, గూడాలలో మా రాజ్యం మాకు కావాలంటే ఏ పార్టీ పట్టించుకోకుండా ఓటు బ్యాంక్ గా చూస్తే సీఎం కేసిఆర్ సుమారు 4000 తండాలను గ్రామ పంచాయతీలు చేసి, అక్కడ అన్ని వసతులు కల్పిస్తూ వాటి సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తున్నారు అని మంత్రి సత్యవతి తెలిపారు.

ఈరోజు ప్రభుత్వం అమలు చేస్తున్న అనేక పథకాల్లో గిరిజన బిడ్డలు గొప్పగా లబ్ది పొందుతున్నారు. ఆదివాసీ ఆవాసాలకు వెంటనే 3 ఫేజ్ కరెంట్ ఇవ్వాలని ఆదేశించారు.

దీనికి రూ. 220 కోట్లు అవసరం అంటే వెంటనే ఆ నిధులను సీఎం కేసీఆర్ విడుదల చేశారని మంత్రి సత్యవతి గుర్తు చేశారు.

గిరిజన గురుకులాల్లో చదివి.. ఆయా ప్రవేశ పరీక్షల్లో సీట్లు సాధించిన విద్యార్థులకు ప్రత్యేక ప్రోత్సాహకాలు ఇస్తున్నామని మంత్రి పేర్కొన్నారు.

గురుకుల పాఠశాలల్లో లక్షల మంది గిరిజన బిడ్డలు నాణ్యమైన విద్య అభ్యసిస్తున్నారు.

స్పోర్ట్స్ కోసం ప్రత్యేక కాలేజీలు ఉన్నాయి. దేశంలో ఎక్కడ లేని విధంగా ఇక్కడ గిరిజనుల కోసం ప్రత్యేక ఐఏఎస్ స్టడీ సర్కిల్ కూడా ఉంది. ఆశ్రమ పాఠశాలలను తెలుగు మీడియం నుంచి ఇంగ్లీష్ మీడియానికి తీసుకురావాలి అని మంత్రి సత్యవతి పేర్కొన్నారు.

### చరిత్రలో నేటినిజం

నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం



( ఆగష్టు 10 హాస్యనటుడు కొండవలస లక్ష్మణరావు జయంతి....)

-రాధశ్రీ

సెల్: 9494481210



## హుజురాబాద్‌లో దళిత బంధు కోసం రూ. 500 కోట్లు విడుదల

హైదరాబాద్ , ఆగష్టు 9: హుజురాబాద్ నియోజకవర్గంలోని దళితులకు ముఖ్యమంత్రి కేసీఆర్ శుభవార్త వినిపించారు. దళిత కుటుంబాల్లో వెలుగులు నింపేందుకు సీఎం కేసీఆర్ ఎన్నెన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారు. తాజాగా దళితులను వ్యాపారులుగా మార్చేందుకు దళిత బంధు పథకాన్ని ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెడుతున్నారు ముఖ్యమంత్రి.

ఈ క్రమంలో హుజురాబాద్ నియోజకవర్గంలో దళిత బంధు అమలుకు రాష్ట్ర ప్రభుత్వం జీవో జారీ చేసింది. ఈ పథకం అమలు కోసం రూ. 500 కోట్లు విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. హుజురాబాద్ నియోజకవర్గంలో పైలట్ ప్రాజెక్టుగా తెలంగాణ దళిత బంధు పథకం అమలు కానుంది. ఈ నెల 16వ తేదీన ముఖ్యమంత్రి కేసీఆర్ ఈ పథకాన్ని హుజురాబాద్ వేదికగా ప్రారంభించనున్నారు. దీనికి సంబంధించి మంత్రులు, అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. మొన్న వాసాలమర్రి దళితుల కోసం ఈ పథకం కింద రూ. 7.60 కోట్లు విడుదల చేసిన సంగతి తెలిసిందే.

## గర్భాశయంలో 3 కిలోల కణితి.. తొలగించిన హైదరాబాద్ డాక్టర్లు

హైదరాబాద్ , ఆగష్టు 9: హైదరాబాద్‌కు చెందిన ఓ మహిళ గర్భాశయంలో ఉన్న 3 కిలోల కణితిని రెనోవో ఆస్పత్రి డాక్టర్లు తొలగించారు. సదరు మహిళకు కొద్ది కాలం నుంచి కడుపులో తీవ్రమైన నొప్పి రావడం, వెన్నునొప్పి అధికమవడంతో.. రెనోవో ఆస్పత్రిలోని గైనకాలజిస్టు డాక్టర్ రాజా శ్రీని సంప్రదించింది. దీంతో డాక్టర్ ఆమెకు వైద్య పరీక్షలు నిర్వహించగా.. గర్భాశయంలో కణితి ఉన్నట్లు గుర్తించారు.

ఈ క్రమంలో బాధిత మహిళకు డాక్టర్ రాజా శ్రీ, సర్జికల్ అంకాలజిస్ట్ డాక్టర్ సంజయ్ కలిసి సర్జరీ నిర్వహించి గర్భాశయంలో ఉన్న కణితిని తొలగించారు. ఈ కణితి బరువు 3 కిలోలు ఉందని వైద్యులు తెలిపారు. కణితిని పరీక్షల నిమిత్తం హిస్టోపాథాలాజికల్ ఎగ్జామినేషన్‌కు పంపించారు.

అయితే బాధిత మహిళ 15 ఏండ్ల క్రితం సర్వైకల్ క్యాన్సర్ బారిన పడిందని, దానికి శస్త్ర చికిత్స కూడా నిర్వహించినట్లు తెలిసింది. గర్భాశయాల్లో కణితులు అరుదుగా ఏర్పడుతాయని వైద్యులు పేర్కొన్నారు. సరైన సమయంలో సర్జరీ నిర్వహించకపోతే ప్రమాదం కలిగే అవకాశం ఉందన్నారు. ప్రస్తుతం మహిళ కోలుకుంటుందని డాక్టర్ రాజా శ్రీ వెల్లడించారు.

## ఎన్ఎస్‌వో గ్రూప్‌తో ఎలాంటి లావాదేవీలు జరుపలేదు: రక్షణ శాఖ

న్యూఢిల్లీ, ఆగష్టు 9: పెగాసస్ స్పైవేర్‌కు సంబంధించి దాని తయారీ సంస్థ ఎన్ఎస్‌వో గ్రూప్‌తో ఎలాంటి లావాదేవీలు జరుపలేదని కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ సోమవారం పార్లమెంట్‌కు తెలిపింది. 'ఎన్ఎస్‌వో గ్రూప్ టెక్నాలజీస్‌తో ప్రభుత్వం ఏమైనా లావాదేవీలు జరిపిందా? ఒక వేళ జరిపితే ఆ వివరాలు ఏమిటి? ' అని సీపీఎం ఎంపీ డాక్టర్ వి శివదాసన్ రాజ్యసభలో ఒక ప్రశ్న అడిగారు. కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ దీనిపై సోమవారం లిఖిత పూర్వకంగా సమాధానం ఇచ్చింది. ఎన్ఎస్‌వో గ్రూప్ టెక్నాలజీతో ఎలాంటి లావాదేవీలు జరుపలేదని వెల్లడించింది.

కాగా, నిఘా, ఇంటెలిజెన్స్ సమాచార సేకరణకు సంబంధించిన పెగాసస్ స్పైవేర్ వినియోగం గురించి కేంద్ర హోం మంత్రిత్వ శాఖ, విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ లేదా క్యాబినెట్ సెక్రటేరియట్ వంటి ఇతర మంత్రిత్వ శాఖలు ఇంకా ఎలాంటి ప్రకటన చేయలేదు. పెగాసస్ స్పైవేర్ ద్వారా అనేక మంది ప్రతిపక్ష నేతలు, న్యాయవ్యవస్థకు చెందిన వారు, ప్రభుత్వంపై విమర్శలు చేసే జర్నలిస్టులు, కొందరు కేంద్ర మంత్రులు, మంత్రిత్వ శాఖల సిబ్బంది, సైనిక అధికారులతోపాటు పలువురి మొబైల్ ఫోన్లు హ్యాక్ అయినట్లు ది వైర్ పలు సంచలన కథనాలను ప్రచురించింది. ఈ నేపథ్యంలో పార్లమెంట్ వర్షాకాల సమావేశాలను ఈ అంశం కుదిపేసింది. దీనిపై కేంద్ర ప్రభుత్వం వివరణ ఇవ్వాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి.

## సమాజానికి దారి చూపే రచనలు రావాలి : మంత్రి శ్రీనివాస్ గౌడ్



హైదరాబాద్ , ఆగష్టు 9: పుస్తకపఠనాభిరుచి తగ్గుతున్న ఈ కాలంలో అందరిని ఆకట్టుకునే విధంగా ఉంటూనే సమాజానికి దారి చూపగల రచనలు చేయాలని పర్యాటక, సాంస్కృతిక మంత్రి వి.శ్రీనివాసగౌడ్ అన్నారు. తెలంగాణ సారస్వత పరిషత్తు ఆధ్వర్యంలో డా.దేవులపల్లి రామానుజరావు కళామందిరంలో సోమవారం జరిగిన తెలంగాణ సాహిత్య పురస్కారాల ప్రదానోత్సవంలో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..పిల్లలకు విద్యార్థి దశలోనే స్ఫూర్తి కలిగించి అనంతరకాలంలో ఉత్తమ పౌరులుగా రూపొందే విధంగా రచనలు చేయాలని ఆయన కోరారు.

తెలంగాణలో కవులు, కళాకారులకు కొరత లేదని, ప్రత్యేక రాష్ట్రంలో తెలంగాణ గొప్పదనాన్ని తమ రచనల్లో ప్రతిబింబింపజేస్తున్నారని అన్నారు. సామాజిక మాధ్యమాలను మంచికోసం ఉపయోగించాలని సూచించారు. అన్నిపోరాటాల కాలంలో సాహిత్యం తన ప్రభావం చూపిందని పేర్కొన్నారు. పరిషత్తు అధ్యక్షుడు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి సభకు అధ్యక్షత వహించారు. పురస్కారాల ఎంపిక ప్రామాణిక పద్ధతిలో సవ్యంగా జరిగిందని, సుమారు 80 ఏండ్ల చరిత్ర కలిగిన తమ సంస్థ విశిష్ట కార్యక్రమాలతో ముందుకు సాగుతుందని ఆయన వివరించారు.

శాంతా బయోటెక్నిక్స్ అధినేత పద్మభూషణ్ డా.కె.ఐ. వరప్రసాదరెడ్డి విశిష్ట అతిథిగా ప్రసంగిస్తూ.. పుస్తకాలు ప్రయోజనదాయకంగా ఉన్నప్పుడే సార్థకత చేకూరుతుందన్నారు. పరిషత్తు ప్రధాన కార్యదర్శి డా.జె. చెన్నయ్య స్వగతోపన్యాసం చేశారు. కథా ప్రక్రియలో కె.వి. నరేందర్, విమర్శలో కె.పి. అశోక్ కుమార్, ఇతర ప్రక్రియలో అన్నవరం దేవేందర్‌లకు పురస్కారాలు అందజేశారు. వచన కవిత్వంలో నాగరాజు రామస్వామి తరఫున తుమ్మూరి రాంమోహనరావు, నవలా ప్రక్రియలో పరవస్తు లోకేశ్వర్ తరఫున రాపోలు సుదర్శన్ పురస్కారం అందుకున్నారు.

ప్రముఖ రచయిత్రి పోల్కంపల్లి శాంతాదేవి, ప్రముఖ కవులు వేణుసంకోజు, డా.దామెర రాములు, సాహితీవేత్త ఐతా చంద్రయ్యలకు వరిష్ఠ పురస్కారం అందజేశారు. ఒక్కొక్కరికి 20 వేల రూపాయల నగదు, జ్ఞాపిక, శాలువాతో సత్కరించారు. తగుళ్ల గోపాలకు యువ పురస్కారం కింద 10 వేల రూపాయలు నగదు, జ్ఞాపిక, శాలువాతో సత్కరించారు. పరిషత్తు కోశాధికారి మంత్రి రామారావు వందన సమర్పణ చేశారు.

## ఆధ్యాత్మికతతో పాటు ఆహ్లాదానికి ప్రాధాన్యం : మంత్రి ఐకే రెడ్డి



హైదరాబాద్ , ఆగష్టు 9:ఆధ్యాత్మికతతో పాటు మానసిక ఆహ్లాదం కలిగించేలా ఆలయాల పరిసరాలను తీర్చిదిద్దాలని దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి అన్నారు. నిర్మల్ జిల్లాలోని ప్రధాన ఆలయాల అభివృద్ధి పనులపై సోమవారం అరణ్య భవన్‌లో మంత్రి సమీక్ష నిర్వహించారు. బాసర జ్ఞాన సరస్వతి దేవస్థానం, అడెల్లి పోచమ్మ, కాల్వ లక్ష్మినర్సింహా స్వామి, కదిలి పాపహరేశ్వర స్వామి ఆలయాల అభివృద్ధి పనుల పురోగతిపై మంత్రి సమీక్షలో చర్చించారు. వివిధ ఆలయాల్లో కొనసాగుతున్న పనులు, త్వరలో చేపట్టబోయే పనులకు సంబంధించి అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా మంత్రికి వివరించారు.

సమావేశంలో మంత్రి మాట్లాడుతూ..ఎకో టూరిజానికి క్రమంగా పర్యాటకులు పెరుగుతున్నప్పటికి టెంపుల్ టూరిజానికి కూడా భక్తులు అత్యధిక ప్రాధాన్యత ఇసున్నారన్నారు. బాసర అమ్మవారిని దర్శించుకునేందుకు వివిధ రాష్ట్రాల నుంచి భక్తులు వస్తున్నారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా అన్ని సదుపాయాలు కల్పించేలా దీర్ఘకాలిక ప్రణాళికలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు.

ముఖ్యంగా భక్తులకు విడిది సౌకర్యం, క్యూ కాంప్లెక్స్, తాగునీరు, షాపింగ్ కాంప్లెక్స్, తదితర సౌకర్యాలు, నదీ పరివాహక ప్రాంతాన్ని సుందరీకరించడంతో పాటు గోదావరి నదికి హరతీనిచ్చే ప్రాంతాన్ని ఆహ్లాదంగా తీర్చిదిద్దడం, బోటింగ్ కు తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. బాసరలో ఆధ్యాత్మిక టూరిజాన్ని మరింత అభివృద్ధి చేయాలని పేర్కొన్నారు.

బాసరలో ఇప్పటికే రూ. 8 కోట్లతో ఆలయ అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయని, బాసరతో పాటు అడెల్లి, కాల్వ, కదిలి ఆలయాల అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఆలయ శిల్పుల సహకారంతో డిజైన్లు రూపొందించి, అందుకు అనుగుణంగా నిర్మాణాలు చేపట్టాలని సూచించారు. అడెల్లి ఆలయ విస్తరణ పనులకు కావాల్సినభూ సేకరణకు తగిన ప్రతిపాదనలు రూపొందించి కలెక్టర్‌కు అందజేయాలన్నారు.

పుణ్యస్నానాలకు ప్రత్యేకంగా షవర్లు (నీటీ జల్లు స్నానం) ఏర్పాటు చేయాలని, కోనేటిలో స్వచ్ఛమైన నీరు ఉండేలా చూడాలన్నారు. డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచడం, అంతర్గత రోడ్ల విస్తరణ, పిల్లలకు ప్రత్యేక ఆట స్థలం, భక్తులకు విడిది గృహాలు, వీఐపీ గెస్ట్ రూంలు, బయో టాయ్లెట్స్ నిర్మించాలని సూచించారు. కాల్వ దేవస్థానంలో కోనేటిని అభివృద్ధి పరచడంతో పాటు భక్తులకు మరిన్ని మెరుగైన సౌకర్యాల కల్పనకు తగిన ఏర్పాట్లు చేయాలన్నారు.

ఆలయాల్లో భక్తులకు కల్పించే పలు సదుపాయాల కోసం దాతలు కూడా విరాళాలు ఇచ్చేందుకు ముందుకు రావాలని మంత్రి కోరారు. సమీక్షలో దేవాదాయ శాఖ కమిషనర్ అనిల్ కుమార్, సత్పతి శ్రీవల్లినాయగం, సీఈజీ సీతారాములు, బాసర ఈవో వినోద్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక : మంత్రి ఎర్రబెల్లి

హైదరాబాద్ , ఆగష్టు 9: ఆసరా పింఛన్లు పొందటానికి కనీస వయస్సు 65 సంవత్సరాల నుంచి 57 సంవత్సరాలకు తగ్గిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సీఎంకేసీఆర్ ఆదేశాల మేరకు అర్హత ఉన్న లబ్ధిదారుల జాబితా వెంటనే తయారుచేసి పెన్షన్లు మంజూరు చేసి, లబ్ధిదారులకు అందించనున్నట్లు పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు తెలిపారు. హైదరాబాద్‌లోని బంజారాహిల్స్ మినిస్టర్ క్యాంప్ కార్యాలయంలో సోమవారం ఆసరా పెన్షన్లు ? వయోపరిమితి తగ్గింపు నేపథ్యంలో తీసుకోవాల్సిన చర్యల పై సంబంధిత ఉన్నతాధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు.



ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ ద్వారా అమలు అవుతున్న వివిధ పథకాలను మంత్రి సమీక్షించారు. రాష్ట్రంలో అర్హులైన, దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న నిరుపేద కుటుంబాలకు పెన్షన్లు అందించాలనే సంకల్పంతో సీఎం పెన్షన్లు పొందడానికి కనీస వయస్సును 65 సంవత్సరాల నుంచి 57 సంవత్సరాలకు తగ్గించారన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరికి మూడు రోజుల లోగా పెన్షన్లు మంజూరు చేయాలని ఆయన అధికారులను అదేశించారు. అర్హుల ఎంపిక పారదర్శకంగా ఉండాలన్నారు.

ఇక పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలో ఉన్న ఉద్యోగులు, అధికారులకు వెంటనే ప్రమోషన్లు ఇవ్వాలని మంత్రి అధికారులకు సూచించారు. రాష్ట్రంలో గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు ఉన్న అధికారులు ఉద్యోగుల ఖాళీల భర్తీ ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలని ఆయన సూచించారు.

ప్రస్తుత వర్షాభావ పరిస్థితుల వల్ల పల్లె ప్రగతి కార్యక్రమంలో భాగంగా హరితహారం పథకం కింద నాటిన మొక్కలను 100% బతికే విధంగా ప్రత్యేక చర్యలను చేపట్టాలని మంత్రి అధికారులను అదేశించారు.

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనులను ఎప్పటికప్పుడు సోషల్ ఆడిటింగ్ చేసి నిధులు సద్వినియోగం అయ్యేలా చూడాలని మంత్రి అధికారులకు సూచించారు.

సోషల్ ఆడిట్ పూర్తి స్థాయిలో పూర్తి చేయాలని, అంతేకాకుండా విలేజ్ రిసోర్స్ పర్సన్స్ ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని ఆయన ఆదేశించారు. పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగంలో ఇంజినీరింగ్ అధికారుల సీనియారిటీ, ఇతర సమస్యలను పరిష్కరించి వెంటనే ప్రమోషన్లు ఇవ్వాలని మంత్రి దయాకర్ రావు అదేశించారు.

రాష్ట్రంలో ఇటీవల కురిసిన భారీ వర్షాల వల్ల దెబ్బతిన్న రోడ్ల మరమ్మతులపై క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి శాశ్వత పరిష్కారం కోసం నివేదిక సమర్పించాలని ఆయన కోరారు. సమావేశంలో పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధి గ్రామీణ నీటి సరఫరా శాఖ కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, సోషల్ ఆడిట్ డైరెక్టర్ సౌమ్య, శాసన మండలి సభ్యుడు పోచంపల్లి శ్రీనివాన్ రెడ్డి ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ప్రపంచ ఆహార భద్రత, పోషకాహార లభ్యత సాధించగలమా?!

## (ఐరాస 'ప్రపంచ ఆహార భద్రత, పోషకాహార స్థితి-2021' అధ్యయన నివేదిక ఆధారంగా)

ఐక్యరాజ్యసమితి శాఖలైన ప్రపంచ ఆహార సంస్థ (యఫ్ఏఓ), యునిసెఫ్, ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ), ఇంటర్నేషనల్ ఫండ్ ఫర్ అగ్రికల్చరల్ డెవలప్‌మెంట్ (ఐయఫ్ఏడి), వరల్డ్ ఫుడ్ ప్రోగ్రామ్ (డబ్ల్యూయఫ్‌పి)లు సంయుక్తంగా నిర్వహించిన అధ్యయనాల ఆధారంగా 'ది స్టేట్ ఆఫ్ ఫుడ్ సెక్యూరిటీ అండ్ న్యూట్రీషన్ ఇన్ ది వరల్డ్-2021, యస్ఓయఫ్ఐ' నివేదికను ఇటీవలే విడుదల చేశారు. ఐరాస సుస్థిరాభివృద్ధి లక్ష్యాల్లో(యస్‌డిజి) భాగంగా 2030 నాటికి ప్రపంచంలో ఆకలి చావులు, పోషకాహార లోపం లేకుండా చూస్తూ, 'జీరో హంగర్' సాధించాలనే ఉన్నత, ఉత్తమ నిర్ణయం తీసుకున్నారు. కోవిడ్-19 విపత్తుతో ప్రపంచంలో పేదల ఆకలి, పోషకాహారలోపం 1.5 శాతం పెరిగి 9.9 శాతానికి చేరిందని నివేదిక స్పష్టం చేసింది. 2020లో 720-811 మిలియన్ల ప్రపంచ జనాభా ఆకలి బారిన పడ్డారని తెలుస్తున్నది. 2019 గణాంకాలతో పోల్చితే 2020లో 118 మిలియన్ల పేదలు ఆకలి అంచున అదనంగా నిలిచారని వివరించింది. ప్రపంచంలో పోషకాహారలోపం అత్యధికంగా ఆసియా దేశాల్లో 418 మిలియన్లు ఉండగా, ఆఫ్రికాలో 282 మిలియన్లు ఉన్నారని తెలుస్తున్నది. ప్రత్యేక చర్యలు అమలు పరచని యెడల 2030 నాటికి 660 మిలియన్ల పేదలు ఉంటారని, ఆకలిని అంతం చేయడం అసాధ్యమని తెలుస్తున్నది. కరోనా మహమ్మారి విజృంభనతో అదనంగా 30 మిలియన్ల పేదలు ఆకలితో సతమతం అవుతున్నారని అర్థం అవుతున్నది.

ప్రపంచవ్యాప్తంగా 2020లో 237 కోట్ల (ప్రతి ముగ్గురిలో ఒకరు) ప్రజలకు అవసరమైనంత ఆహారం లభించడం లేదని నివేదిక తెలుపుతున్నది. 2020లో 12 శాతం (92.8 కోట్లు) జనం ఆహార అభద్రత అనుభవిస్తున్నారని, 2019 వివరాల కన్న 14.8 కోట్ల పేదలు పెరిగారని తెలుస్తున్నది. లింగ వివక్ష కారణంగా పురుషుల కన్న మహిళల్లో 10 శాతం అధికంగా ఆహార అభద్రత అనుభవిస్తున్నారు. ఆహార ధాన్యాల అధిక ధరలు, ఆదాయం తగ్గడం వల్ల 300 కోట్ల పేదలు పోషకాహారానికి దూరం అవుతున్నారు. పోషకాహారలోపం ప్రపంచ మానవాళికి శాపంగా వెంటాడుతున్నది. 2020లో కోవిడ్-19 నేపథ్యంలో ప్రపంచవ్యాప్తంగా 22 శాతం (150 కోట్లు) ఐదేండ్ల లోపు పిల్లలు శరీర వృద్ధి నిలిచిపోవడం (స్టంటింగ్)తో, 6.7 శాతం (4.54 కోట్లు) అభివృద్ధి తగ్గడం (వేస్టింగ్)తో, 5.7 శాతం (3.89 కోట్లు) అధిక బరువు (ఓవర్ వేయిట్) సమస్యలతో బాధ పడుతున్నారు. ఆసియా, ఆఫ్రికా దేశాల్లో పిల్లల పోషకాహారలోపం అత్యధికంగా కనిపిస్తున్నది. ఆసియా, ఆఫ్రికా ప్రాంతాల్లో 15-49 ఏండ్ల మహిళల్లో 30 శాతం రక్తహీనత (ఎనీమియా) సమస్య కనిపించగా, అమెరికా, యురొప్‌లో 14.6 శాతం మాత్రమే నమోదు అయ్యింది

. గర్భిణి మహిళల్లో రక్తహీనత, పిల్లల్లో ఎదుగుదల మందగించడం, తల్లిపాల లభ్యత పడిపోవడం, తక్కువ బరువుతో శిశు జననాలు, ఓవర్ వేయిట్ పిల్లలు పెరగడం, వయోజనుల్లో స్థూలకాయం లాంటి సమస్యల మధ్య 2030 నాటికి ఆకలిని అంతం చేయడం అసాధ్యమని వివరించారు.

ఆహార అభద్రత, పోషకాహారలోపం పెరగడానికి కారణాలుగా వాతావరణ అసాధారణ ప్రతికూల మార్పులు, ఆర్థిక మందగమనం, ఆర్థిక అసమానతలు, లాక్‌డౌన్/కర్ఫ్యూలు లాంటి అంశాలు పేర్కొనబడినవి. ఆహార ధాన్యాల దిగుబడి తగ్గడం, మార్కెటింగ్ శృంఖలంలో లోసుగులు (ఉత్పత్తి, పంట కోత, ప్రాసెసింగ్, రవాణ, మార్కెటింగ్, సరైన ధర పలకడం), ఆదాయాలు తగ్గడంతో పోషకాహారానికి పేదలు దూరం అవుతున్నారు. పోషకాహార ఆహార లభ్యత పెరగడానికి కారణాలుగా మానవీయతను పోషిస్తూ శాంతి స్థాపనలు, వాతావరణ ఒడుదుడుకులను తట్టుకోగల ఆహార వ్యవస్థలు, ఆర్థిక కష్టాలను అధిగమించడం, ఆహార సరఫరా శృంఖలంలో నాణ్యతను పరిరక్షించడం, పేదరికంతో పాటు అసమానతలను తొలగించడం, పోషకాహారం పట్ల ఆరోగ్య అవగాహన కల్పించడం లాంటి అంశాలు పేర్కొనబడినవి. ఆర్థిక అసమానతలు పెరిగితే ప్రకృతి సహజ వనరులైన సారవంతమైన నేలలు, మత్స్యసంపద, అటవీ సంపద, నీటి వనరుల కోసం సంఘర్షణలు కలగడం సర్వసాధారణమని నమ్మాలి. సమాజంలో ఆదాయం, ఉత్పత్తి సామర్థ్యం, ఆస్తులు, టెక్నాలజీ, విద్య, ఆరోగ్య రంగాల్లో అసమానతలు పెరిగితే వాటి దుష్ప్రభావానికి అధికంగా మహిళలు, పిల్లలపై నేరుగా పడుతుంది. ఆహార ధాన్యాల ఉత్పత్తి నుంచి వినియోగం వరకు ఇమిడి ఉన్న పలు దశల్లో ఆహారం వ్యర్థం కావడం నేర సమానమని నమ్మాలి. ఆహారాన్ని ఆదా చేస్తే ఆహారం ఉత్పత్తి చేసిన దాని కన్న మిన్న అని తెలుసుకోవాలి. 'యుయన్ ఫుడ్ సిస్టమ్స్ సమిట్-2021' సూచనల ప్రకారం ప్రపంచ దేశాలు తమదైన చర్యలను తీసుకుంటూ 2030 నాటికి 'జీరో హంగర్' దిశగా సుస్థిరాభివృద్ధి లక్ష్యాలైన ఆహార అభద్రత (యఎన్‌డిజి టార్గెట్-2.1), పోషకాహారలోపాలను (యఎన్‌డిజి టార్గెట్-2.2) అధిగమించి, అనుకున్న సదుద్దేశ్యాలను సగర్వంగా చేరుకోవాలని ఆశిద్దాం.



- డా|| బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

# ఏపీలో పర్యావరణ చట్టం ఉల్లంఘిస్తున్నారు: ఎన్జీటీ

అమరావతి, ఆగస్టు 9:ఏపీ ప్రభుత్వం చేపట్టిన పోలవరం, పట్టిసీమ, పురుషోత్తమపట్నం ప్రాజెక్టులపై నేషనల్ గ్రీన్ ట్రైబ్యునల్ (ఔఠు) తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. పర్యావరణ చట్టాన్ని తీవ్రంగా ఉల్లంఘించడం సిగ్గుచేటు అని ఎన్జీటీ వ్యాఖ్యానించింది. పర్యవరణ అనుమతుల్లేకుండా నిర్మాణాలు చేపట్టిన వారిపై చర్యలు తీసుకోకపోవడంపై మండిపడింది. పోలవరం కాఫర్ డ్యాం వల్ల ముంపు జరుగుతుంటే ఏం చర్యలు తీసుకున్నారని ప్రశ్నించింది. కేంద్ర పర్యావరణ కాలుష్య నియంత్రణ మండలి (సీపీసీబీ) కూడా చర్యలు తీసుకోకపోవడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. సీపీసీబీ నివేదికలో కేసు ముగించాలన్న ఆత్రుత మాత్రమే కనిపించిందని తప్పుబట్టింది.

చట్టబద్ధంగా నివేదిక ఇవ్వాలన్న చిత్తశుద్ధి లోపించిందన్న ఎన్జీటీ ధర్మాసనం.. తనిఖీలకు వెళ్లిన అధికారులు వాస్తవాలు వెల్లడించలేకపోయారని ఎన్జీటీ అసహనం వ్యక్తం చేసింది. మరోవైపు ప్రభుత్వమే పర్యావరణ అనుమతులు లేకుండా ప్రాజెక్టు నిర్మాణాలు చేపడితే ఎలా అని ఘాటుగా ప్రశ్నించింది. పర్యావరణ ప్రభావ అంచనాను తూతూ మంత్రంగా చేశారని తప్పుబట్టింది.

# రష్యాలో నిర్వహించనున్న అంతర్జాతీయ సైనిక క్రీడలు-2021లో పాల్గొననున్న భారత బృందం

న్యూఢిల్లీ, ఆగస్టు 9:ఈ నెల 22 నుంచి సెప్టెంబర్ 4వ తేదీ వరకు రష్యాలో జరగనున్న 'అంతర్జాతీయ సైనిక క్రీడల్లో' పాల్గొనేందుకు భారత సైన్యానికి చెందిన 101 సభ్యుల బృందం రష్యాకు వెళ్లనుంది. ఆర్మీ స్కౌట్ మాస్టర్స్ కాంపిటీషన్ (ఏఎస్ఎంసీ), ఎల్బ్రస్ రింగ్, పోలార్ స్టార్, స్నిపర్ ఫ్రాంటియర్, సేఫ్ రూట్ పోటీల్లో భారత బృందం పాల్గొంటుంది. ఎత్తైన పర్వత భూ భాగాల్లో, మంచులో విన్యాసాలు, స్నిపర్ ఆపరేషన్లు, అడ్డంకులతో నిండిన ప్రాంతాల్లో పోరాట ఇంజినీరింగ్ నైపుణ్యాలను ప్రదర్శించే ఆటలు ఈ క్రీడా సంగ్రామంలో జరుగుతాయి. ఓపెన్ వాటర్, ఫాల్కన్ హంటింగ్ క్రీడల్లోనూ భారత బృంద సభ్యులు పాల్గొంటారు. పాంటూన్ వంతెనల నిర్మాణం, యూఏవీ సిబ్బంది నైపుణ్యాలను ఇందులో ప్రదర్శిస్తారు.

మూడంచెల పరిశీలనల తర్వాత, వివిధ విభాగాల్లో భారత సైన్యాన్ని ఉత్తమ బృందంగా ఎంపిక చేశారు. ఈ పోటీల్లో పాల్గొనడం ద్వారా, భారత సైన్యం సత్తా ప్రపంచ దేశాల సైన్యాలకు తెలుస్తుంది. వివిధ దేశ సైన్యాల మధ్య సహకారాన్ని కూడా ఈ క్రీడలు ప్రోత్సహిస్తాయి. జైసల్మేర్‌లో జరిగిన ఆర్మీ స్కౌట్స్ మాస్టర్ కాంపిటీషన్-2019లో పాల్గొన్న ఎనిమిది దేశాల్లో భారత్ తొలి స్థానంలో నిలిచింది.

# పార్టీ మార్పుపై ఎమ్మెల్యే రాజయ్య క్లారిటీ



న్యూఢిల్లీ, ఆగస్టు 9:తాను పార్టీ మారుతున్నట్లు జరుగుతున్న ప్రచారంపై స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య స్పందించారు. తన జీవితాంతం టీఆర్ఎస్ పార్టీలోనే ఉంటానని రాజయ్య స్పష్టం చేశారు. లోటస్ పాండ్‌లో షర్మిల భర్త అనిల్ కుమార్‌ను కలిసినట్టు వచ్చిన వార్తలు వాస్తవం కాదని స్పష్టం చేశారు. పాత ఫొటోలతో పార్టీ మారుతున్నట్లు అసత్య ప్రచారాలు చేయొద్దని కోరారు. వ్యక్తిగత పరిచయాలను రాజకీయాలకు ముడిపెట్టడం సరికాదన్నారు. 2019 సంవత్సరంలో ఒక క్రైస్తవ సమావేశానికి ముందు అనిల్ కుమార్‌ను కలిసినప్పుడు దిగిన ఫోటో అని స్పష్టం చేశా రు. వాస్తవాలు తెలుసుకోకుండా అసత్య ప్రచారం మొదలు పెట్టిన వారి విజ్ఞతకే వది లేస్తున్నానని పేర్కొన్నారు. అసత్య ప్రచారాలు చేసి మనసు గాయపర్చవద్దని విన్నవించారు.తెలంగాణ ఏర్పడిన తర్వాత ఎవరికీ ఇవ్వని ప్రాధాన్యతను సీఎం కేసీఆర్ తనకు ఇచ్చారని రాజయ్య తెలిపారు. అడగకముందే డిప్యూటీ సీఎం పదవితోపాటు తనకు ఇష్టమైన వైద్యారోగ్య శాఖను ఇచ్చారని గుర్తు చేశారు. సీఎం కేసీఆర్ ఆశీస్సులతో తాను టీఆర్ఎస్ పార్టీలో అంచెలంచెలుగా ఎదిగాను అన్నారు. తెలంగాణ తొలి డిప్యూటీ సీఎంగా చరిత్రలో నిలిచిపోయేలా కేసీఆర్ నాకు భిక్ష పెట్టారని పేర్కొన్నారు. కేసీఆర్ దళితుల పక్షపాతి అని చెప్పారు. దళితులు తలెత్తుకుని తిరిగే విధంగా దళిత బంధు కార్యక్రమాన్ని సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టారని రాజయ్య కొనియాడారు.

# గుడిసెలోకి దూసుకెళ్లిన లారీ.. 8 మంది మృతి

న్యూఢిల్లీ, ఆగస్టు 9:గుజరాత్ లోని అమ్రేలి ఘోర ప్రమాదం జరిగింది. రోడ్డు పక్కన ఉన్న గుడిసెలోకి ఓ ట్రక్కు దూసికెళ్లింది. ఈ ఘటనలో 8 మంది మృతి చెందారు. సోమవారం తెల్లవారుజామున 2.30 ప్రాంతంలో బధడా గ్రామంలో ఈ ప్రమాదం జరిగింది. మృతుల్లో ఇద్దరు చిన్నారులు ఉన్నట్లు అధికారులు తెలిపారు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారని పేర్కొన్నారు. క్షతగాత్రులను సమీపంలోని ఆస్పత్రికి తరలించారు. ట్రక్కుపై డ్రైవర్ నియంత్రణ కోల్పోయి.. 10 మంది నిద్రిస్తున్న రోడ్డు పక్కనే ఉన్న గుడిసెలోకి దూసుకెళ్లినట్లు పోలీసులు తెలిపారు.

## పొంచిఉన్న కరోనా మూడవదశ ప్రమాదం నియంత్రణపై

# కరీంనగర్ కమిషనరేట్ పోలీసులు కొనసాగిస్తున్న ప్రచారపర్వం, స్పెషల్‌డ్రైవ్‌లు



కరీంనగర్, ఆగస్టు 9:(నేటినిజం ప్రతినిధి): కరోనా మూడవదశ ప్రమాదం పొంచిఉన్న నేపథ్యంలో కరీంనగర్ కమిషనరేట్ పోలీసులు నియంత్రణ చర్యలను అప్రతిహతంగా కొనసాగిస్తున్నారు. మాస్కుల వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించడంతోపాటు మాస్కులను ధరించని వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవడం కోసం ఈనెల 4న పోలీస్ కమిషనర్ వి సత్యనారాయణ స్పెషల్‌డ్రైవ్‌లను ప్రారంభించిన విషయం విదితమే. కమిషనరేట్‌లోని పోలీసులు మాస్కులు ధరించడం వల్ల కలిగే ప్రయోనాలు, ధరించకపోవడం వల్ల దుష్పరిణామాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ పోస్టర్లను ముద్రించి అంటించ డంతోపాటు కళాబృందాలతో ప్రదర్శనలు కొనసాగిస్తున్నారు. కరోనా మొదటి, రెండవదశ ప్రారంభంలో వేలాదిమంది ప్రాణాలను కోల్పోయిన దుస్థితులను దృష్టిలో ఉంచుకుని, ప్రజల ప్రాణాల రక్షణకు ప్రాధాన్యతనిస్తూ పోలీస్‌శాఖ ఈ కార్యక్రమాలను కొనసాగిస్తున్నది.

### మాస్కులు ధరించని వారిపై కేసుల నమోదు

ఇన్నిరకాల అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ మాస్కులను ధరించని వారికి జరిమానాలను విధించే పరంపరను కొనసాగిస్తున్నా ఒకటి,రెండుసార్లు జరిమానాలు విధించబడినా మాస్కులను ధరించనివారిపై కేసులను నమోదు చేయాలని పోలీస్‌శాఖ నిర్ణయించింది. వ్యాపారులు మాస్కులను ధరించడం తోపాటు వారివారి దుకాణాల వద్ద ప్రజలు భౌతికదూరం పాటించేలా చర్యలు తీసుకోవాలని, మాస్కులను ధరించి వచ్చిన వారికే వస్తువులను విక్రయించాలని సూచించింది. ప్రస్తుతం కరోనా వైరస్‌వ్యాప్తి కొనసాగుతున్న నేపథ్యంలో ప్రజలు తప్పనిసరి పరిస్థితుల్లో నిత్యావసరవస్తువుల కొనుగోలు, వైద్యం, ఇతర అవసరమైన వాటికి మాత్రమే బయటకు రావాలని పోలీసులు పేర్కొంటున్నారు. వైరస్ ప్రభావంతో కుటుంబసభ్యులు మృతిచెందినా దహన సంస్కారాలు నిర్వహించలేని దుస్థితి, బంధువులు ప్రాణాలు కోల్పోయినా వారి కుటుంబసభ్యులను పరామర్శించలేని దుర్భర పరిస్థితులను కళ్లారాచూసిన ప్రజలు మళ్ళీ అలాంటి గడ్డు పరిస్థితులు పునరావృతం కాకుండా నియంత్రణ చర్యలు తీసుకోవడంతోపాటు, వైద్యుల సలహాలు సూచనలు పాటించాలని కోరుతున్నారు.

### ఫలిస్తున్న ప్రచారపర్వం

కమిషనరేట్ పోలీసులు కళాబృందాలతో నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమాలు, మాస్కుల వినియోగం ద్వారా కలిగే ప్రయోజనాలు, ధరించకపోవడం వల్ల వైరస్‌వ్యాప్తి చెందే తీరుపై కరపత్రాలు, వాల్‌పోస్టర్లను ముద్రించి కొనసాగిస్తున్న ప్రచారపర్వంతో కొంతమేరకు ఫలితాలు వస్తున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం నియమనిబంధనలు పాటిస్తున్నా, పట్టణ ప్రాంతాల్లో ఆశించిన స్థాయిలో ప్రజలు ఆ మార్గదర్శకాలను పాటించక నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటం విచారకరం. అన్నివర్గాల ప్రజలు వాక్సిన్ తీసుకోవాలని కోరుతున్నారు. రోగనిరోధకశక్తిని పెంపొందించుకోవడంకోసం పోషకాలతో కూడిన ఆహారాన్ని తీసుకోవడం ద్వారా వైరస్ సోకకుండా జాగ్రత్తపడవచ్చు.

### ప్రజల ప్రాణాల రక్షణకోసం...
### -పోలీస్ కమిషనర్ వి సత్యనారాయణ

ప్రజల ప్రాణాల రక్షణకోసం పోలీస్ శాఖ కొనసాగిస్తున్న వివిధ రకాల ప్రయత్నాలపై అవగాహన పెంపొందించుకుని ఆచరించడం ద్వారా వైరస్ బారినపడకుండా ఉండటమే కాకుండా విలువైన ప్రాణాలను దక్కించుకోవచ్చని పోలీస్ కమిషనర్ వి సత్యనారాయణ తెలిపారు. ప్రాణాంతక వైరస్ నుండి రక్షణ పొందడం కోసం పోలీస్‌శాఖ తీసుకుంటున్న చర్యలను అన్నివర్గాల ప్రజలు తమవంతు సహకారం అందించాలని కోరారు.

# రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన ఎస్ఐ కుటుంబానికి ఆర్థికసహాయం

కరీంనగర్, ఆగస్టు 9:(నేటినిజం ప్రతినిధి): ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన రిటైర్డ్ ఎస్ఐ పాపయ్యానాయక్ కుటుంబానికి జిల్లా రిటైర్డ్ పోలీసు అధికారుల అసోసియేషన్ ప్రతినిధులు సోమవారంనాడు 10వేల రూపాయల ఆర్థికసహాయాన్ని అందించారు. మృతి చెందిన పాపయ్యానాయక్ వరంగల్ రూరల్‌జిల్లా ముల్కనూరు మండలం గట్టనర్సింగాపూర్‌కు చెందిన వారు.

ఈ కార్యక్రమంలో రిటైర్డ్ పోలీసు అధికారుల అసోసియేషన్ ప్రతినిధులు యండి షరీఫ్, లాల మురళీ, దేవేందర్, యండి యూసుఫ్‌మీర్జా తదితరులు పాల్గొన్నారు.



**వివాహితను రక్షించిన లేక్‌పోలీసులు**

దిగువ మానేరు జలాశయం(ఎల్‌యండి)లో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వివాహితను సోమవారం నాడు లేక్‌అవుట్‌పోస్ట్ పోలీసులు రక్షించారు. వివరాలు ఇలా ఉన్నాయి.

కరీంనగర్‌లోని రామచంద్రాపూర్‌కాలనీకి చెందిన వివాహిత(45) కుటుంబాల కలహాల కారణంగా ఆత్మహత్య చేసుకునేందుకు డ్యాం మెట్టనుండి నీళ్ళలోకి దూకడానికి ప్రయత్నించింది. గస్తీలో ఉన్న పోలీసులు గుర్తించి సత్వరం అమెవద్దకు చేరుకుని నిలువరించారు. వెంటనే ఎస్ఐ వి వెంకటరెడ్డికి సమాచారం అందించారు. ఎస్ఐ ఆమెభర్తను పిలిపించి కౌన్సిలింగ్ నిర్వహించారు. ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వివాహితను రక్షించడంలో కీలకపాత్ర పోషించిన పోలీసులను పోలీస్ కమిషనర్ వి సత్యనారాయణ అభినందించారు.

**క్రైంబృందాలకు శిక్షణ**

కమిషనరేట్‌లోని క్రైంబృందాలకు సోమవారంనాడు కమిషనరేట్ కేంద్రంలో శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సిసిఎస్ ఇన్స్‌పెక్టర్ యం శివకుమార్ మాట్లాడుతూ క్రైంబృందాలకు చెందిన పోలీసులు నేరాల ఛేదనకోసం ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలన్నారు. నేరాల ఛేదనే లక్ష్యంగా ముందుకుసాగాలని పిలుపునిచ్చారు. పాతనేరస్థుల కదలికలపై నిఘాకొనసాగించడంతోపాటు ప్రత్యేక సమాచార వ్యవస్థను ఏర్పరుచుకోవాలని సూచించారు. నేరాల ఛేదన ద్వారా గుర్తింపు లభించడంతోపాటు పోలీస్‌శాఖ ప్రతిష్ట పెంపొందుతుందని తెలిపారు. క్రైంబృందాలకు చెందిన పోలీసులు పరస్పర సహకారంతో నేరాల ఛేదనకు కృషి చేయాలని చెప్పారు. నేరం జరిగిన ప్రాంతాలను క్షుణ్ణంగా పరిశీలించడం ద్వారా ఈ తరహానేరం ఎలాంటి నేరస్థులు పాల్పడుతారో ఒక అంచనాకు రావడంతోపాటు ఆధారాలు లభిస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ అశోక్‌రెడ్డి, క్రైంబృందాలకు చెందిన పోలీసులు పాల్గొన్నారు.

# నేడు ఉజ్వాల 2.0 ప్రారంభించనున్న ప్రధానమంత్రి

న్యూఢిల్లీ, ఆగస్టు 9:ప్రధానమంత్రి శ్రీ నరేంద్రమోదీ ఆగస్టు 10వ తేదీ మధ్యాహ్నం 12.30 గంటలకు వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారా ఉజ్వల 2.0 (ప్రధానమంత్రి ఉజ్వల యోజన - పిఎంయువై) పథకం ప్రారంభిస్తారు. వీడియో కాన్ఫరెన్సింగ్ మాధ్యమంలో జరిగే ఈ కార్యక్రమంలో ఉత్తర ప్రదేశ్ లోని మహోబాలో ఎల్ పిజి కనెక్షన్లు అందిస్తారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి లబ్ధిదారులతో ముఖాముఖి మాట్లాడడంతో పాటు జాతినుద్దేశించి ప్రసంగిస్తారు. 2016 సంవత్సరంలో ప్రారంభమైన ఉజ్వల 1.0 పథకం కింద 5 కోట్ల మంది బిపిఎల్ కుటుంబాలకు చెందిన మహిళలకు ఉచితంగా ఎల్ పిజి కనెక్షన్లు ఇవ్వడం లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. ఆ తర్వాత పథకాన్ని 2018 ఏప్రిల్ నుంచి మరో ఏడు వర్గాలకు చెందిన (ఎస్ సి/ ఎస్ టి, పిఎంఏవై, ఏఏవై, అత్యంత వెనుకబడిన వర్గాలు, తేయాకు తోటల కార్మికులు, అటవీ, ద్వీప ప్రాంత నివాసులు) మహిళలకు విస్తరించారు. ఎల్ పిజి కనెక్షన్ల జారీ లక్ష్యాన్ని కూడా 8 కోట్లకు పెంచారు. 2019 ఆగస్టు నాటికి అంటే నిర్దేశిత సమయం కన్నా 7 నెలల ముందే లక్ష్యాన్ని చేరారు. 2021-22 కేంద్ర బడ్జెట్ లో పిఎంయువై పథకం కింద మరో కోటి ఎల్ పిజి కనెక్షన్ల జారీకి అవసరమైన నిధులు కేటాయిస్తున్నట్టు ప్రకటించారు. ఉజ్వల 2.0 పథకం కింద ఈ అదనపు కోటి పిఎంయువై కనెక్షన్ల జారీ లక్ష్యంలో భాగంగా గతంలో అమలుపరిచిన పిఎంయువై తొలి దశలో చేర్చని అల్పాదాయ వర్గాల కుటుంబాలకు ఎలాంటి డిపాజిట్ లేకుండా ఎల్ పిజి కనెక్షన్లు ఇస్తారు. ఈ ఉజ్వల 2.0 పథకం కింద డిపాజిట్ రహిత ఎల్ పిజి కనెక్షన్ల జారీతో పాటుగా తొలి రీఫిల్, హాట్ ప్లేట్ ఉచితంగా అందిస్తారు. అలాగే పేపర్ వర్క్ కూడా కనిష్ఠంగా ఉంటుంది. ఉజ్వల 2.0లో వలస కార్మికులు రేషన్ కార్డు గాని లేదా అడ్రస్ ప్రూఫ్ గాని సమర్పించాల్సిన అవసరం ఉండదు. కుటుంబ డిక్లరేషన్, అడ్రస్ ప్రూఫ్ రెండూ లిఖిత పూర్వకంగా స్వయం ప్రకటితంగా అందిస్తే చాలును.

# మరణించిన ప్రభుత్వ ఉద్యోగి/పెన్షనర్ యొక్క దివ్యాంగ్ పిల్లలు కుటుంబ పెన్షన్ ఎమ్యులేషన్‌లలో భారీ పెంపు

న్యూఢిల్లీ, ఆగస్టు 9:కేంద్ర సహాయ మంత్రి (ఇండిపెండెంట్ ఛార్జ్) సైన్స్ ఉ టెక్నాలజీ, సహాయ మంత్రి (ఇండిపెండెంట్ ఛార్జ్) ఎర్త్ సైన్సెస్, ఎంఓఎస్ పిఎంఓ, పర్సనల్, పబ్లిక్ గ్రీవెన్స్, పెన్షన్స్, అటామిక్ ఎనర్జీ మరియు స్పేస్ డాక్టర్ జితేంద్ర సింగ్ ఈ రోజు మాట్లాడుతూ " మరణించిన వారి దివ్యాంగ్ పిల్లలు ప్రభుత్వ ఉద్యోగి/పెన్షనర్ కుటుంబ పెన్షన్ ఎమ్యులేషన్‌లలో భారీ పెంపును పొందుతారని చెప్పారు. ఈ మేరకు పెన్షన్లు మరియు పెన్షనర్ల సంక్షేమ శాఖ ద్వారా సూచనలు జారీ చేయబడ్డాయి.

ఈ మైలురాయి నిర్ణయం గురించి డాక్టర్ జితేంద్ర సింగ్ క్లుప్తంగా మాట్లాడుతూ "అటువంటి పిల్లల గౌరవం మరియు సంరక్షణపై ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రత్యేక దృష్టి సారించినట్లు" చెప్పారు. దివ్యాంగులు లేదా వికలాంగులైన వారికి మెరుగైన వైద్య సంరక్షణ మరియు ఆర్థిక సహాయం అవసరమయ్యే జీవన సౌలభ్యం మరియు మెరుగైన ఆర్థిక పరిస్థితులు ఈ నిర్ణయం ద్వారా కలుగుతాయని చెప్పారు.

సిసిఎస్ (పెన్షన్) రూల్స్ 1972 ప్రకారం కుటుంబ పెన్షన్ మంజూరు కోసం మరణించిన ప్రభుత్వ ఉద్యోగి/పెన్షనర్ యొక్క అర్హత/పిల్లల అర్హత కోసం ఆదాయ ప్రమాణాలను సరళీకరించడానికి సూచనలు జారీ చేయబడ్డాయని మంత్రి తెలియజేశారు. కుటుంబ పెన్షన్ కోసం అర్హత ప్రమాణాలు, ఇతర కుటుంబ సభ్యుల విషయంలో వర్తిస్తాయి. వైకల్యంతో బాధపడుతున్న పిల్లల/తోబుట్టువుల విషయంలో వర్తించకపోవచ్చని మంత్రి తెలిపారు.

డాక్టర్ జితేంద్ర సింగ్ మాట్లాడుతూ 'పిల్లలు/తోబుట్టువులకు సంబంధించి కుటుంబ పెన్షన్ కోసం అర్హత కోసం ఆదాయ ప్రమాణాలను ప్రభుత్వం సమీక్షించిందని, వైకల్యంతో బాధపడుతున్న పిల్లలకు/తోబుట్టువులకు కుటుంబ పెన్షన్ అర్హత కోసం ఆదాయ ప్రమాణం నిర్ణయించబడిందని చెప్పారు.

మానసిక లేదా శారీరక వైకల్యంతో బాధపడుతున్న మరణించిన ప్రభుత్వ ఉద్యోగి/పెన్షనర్ యొక్క బిడ్డ/తోబుట్టువు జీవితాంతం కుటుంబ పెన్షన్‌కు అర్హులు అని పెన్షన్లు మరియు పెన్షనర్ల సంక్షేమ శాఖ ఆదేశాలు జారీ చేసిందని మంత్రి తెలియజేశారు. అతను/ఆమె మొత్తం ఆదాయం, కుటుంబ పెన్షన్ కాకుండా అర్హత కలిగిన కుటుంబ పెన్షన్ కంటే తక్కువగా ఉంటే, అంటే మరణించిన ప్రభుత్వ ఉద్యోగి/పెన్షనర్ తీసుకున్న చివరి వేతనంలో 30% ప్లస్ డియర్‌నెస్ రిలీఫ్ ఆమోదయోగ్యమైనది.

సిసిఎస్ (పెన్షన్) రూల్స్, 1972 నిబంధన 54 (6) ప్రకారం మరణించిన ప్రభుత్వ ఉద్యోగి లేదా పెన్షనర్ యొక్క ఒక బిడ్డ/తోబుట్టువు, మానసిక లేదా శారీరక వైకల్యంతో బాధపడుతూ లేదా జీవనోపాధిని సంపాదించుకోలేని వైకల్యంతో అతను లేదా ఆమె బాధపడుతుంటే వారు జీవితాంతం కుటుంబ పెన్షన్‌కు అర్హులు. ప్రస్తుతం కుటుంబ సభ్యుడు, ఒక వైకల్యంతో బాధపడుతున్న పిల్ల/తోబుట్టువుతో సహా అతని/ఆమె కుటుంబ పెన్షన్ కాకుండా ఇతర వనరుల నుండి వచ్చే ఆదాయం, కనీస కుటుంబ పెన్షన్ అంటే 9000 కంటే ఎక్కువ లేదా అంతకంటే ఎక్కువ ఉంటే అతని జీవనోపాధిగా మరియు డియర్‌నెస్ రిలీఫ్‌కు ఆమోదయోగ్యమైనది.

మునుపటి ఆదాయ ప్రమాణాలను నెరవేర్చనందున కుటుంబ పెన్షన్ పరిధిలో లేని మానసిక/శారీరక వైకల్యంతో బాధపడుతున్న ఒక బిడ్డ/తోబుట్టువు విషయంలో, అతనికి/ఆమెకు కుటుంబ పెన్షన్ మంజూరు చేయబడుతుంది . ఆమె కొత్త ఆదాయ ప్రమాణాలను నెరవేరుస్తుంది మరియు ప్రభుత్వ ఉద్యోగి లేదా పెన్షనర్ లేదా మునుపటి కుటుంబ పెన్షనర్ మరణించినప్పుడు కుటుంబ పెన్షన్ మంజూరు చేయడానికి ఇతర షరతులను కూడా నెరవేర్చింది. అయితే, అలాంటి సందర్భాలలో, ఆర్థిక ప్రయోజనాలు అందించబడతాయి. మరియు ప్రభుత్వ ఉద్యోగి/ పెన్షనర్/ మునుపటి కుటుంబ పెన్షనర్ మరణించిన తేదీ నుండి ఎటువంటి బకాయిలు ఆమోదించబడవు.

# జనసంద్రంగా మారిన కాంగ్రెస్ దండోరా సభ

ఆదిలాబాద్, ఆగస్టు 9: ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లిలో కాంగ్రెస్ పార్టీ తలపెట్టిన దండోరా సభ జనసంద్రంగా మారింది. పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డితోపాటు పార్టీ సీనియర్ నాయకులంతా ఇంద్రవెల్లికి చేరుకున్నారు. ఈ సభకు కాంగ్రెస్ కార్యకర్తలతో పాటు దళితులు, ఆదివాసీలు, ప్రజలు భారీగా తరలివచ్చారు. దళిత గిరిజన దండోరా కార్యక్రమానికి అన్ని జిల్లాల నుంచి పెద్దసంఖ్యలో కాంగ్రెస్ శ్రేణులను తరలి వచ్చారు. కాంగ్రెస్ అధిష్టానం ఆదేశాల మేరకు నియోజకవర్గాల వారీగా జనసమీకరణ చేశారు. హైదరాబాద్ సహా పలు జిల్లాల నుంచి కాంగ్రెస్ శ్రేణులు సొంత వాహనాల్లో సభకు చేరుకున్నారు.

# ఉత్తమ ప్రతిభతో స్టార్ ఫెర్ఫార్మర్లుగా ఆర్‌టీసీ సిబ్బంది

హైదరాబాద్ , ఆగస్టు 9:గచ్చిబౌలిలోని హెచ్‌సియూ డిపోలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఆర్‌టీసి డ్రైవర్‌లు, కండక్టర్‌లకు శేరిలింగంపల్లి : గచ్చిబౌలిలోని హెచ్‌సియూ డిపోలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఆర్‌టీసి డ్రైవర్‌లు, కండక్టర్‌లకు సోమవారం అభినందన సభ ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా విధుల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఫలువురిని డిపో మేనేజర్ పి. శ్రీనివాస్ స్టార్ ఫెర్ఫార్మర్లుగా గుర్తించి వారిని అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ? డ్రైవర్‌లు, కండక్టర్‌లు స్టార్ ఫెర్ఫార్మర్లుగా గుర్తించబడేందుకు కృషి చేయాలని, ప్రతి ఒకరు ఇదే స్ఫూర్తితో ముందుకు నడవాలని కోరారు. మిగతా ఉద్యోగులు సైతం ఆదర్శంగా తీసుకొని తమ ఫెర్ఫార్మెన్స్?ను రెట్టింపు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ రామయ్య తదితరులు ఉన్నారు.



# అభిషేక్ బెనర్జీపై దాడి వెనుక అమిత్ షా హస్తం : మమతా బెనర్జీ

కోల్‌కతా, ఆగష్టు 9:: కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రోద్భలంతోనే తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ అభిషేక్ బెనర్జీతో పాటు తమ కార్యకర్తలపై త్రిపురలో దాడి జరిగిందని పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ ఆరోపించారు. త్రిపురలో అభిషేక్ బెనర్జీ సహా తృణమూల్ కార్యకర్తలపై కాషాయ పార్టీ శ్రేణులు ఇటీవల దాడికి తెగబడిన నేపథ్యంలో ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. త్రిపుర, అసోం, యూపీ సహా బీజేపీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో అరాచక పాలన సాగిస్తోందని దీదీ దుయ్యబట్టారు.

త్రిపురలో అభిషేక్ బెనర్జీతో పాటు తృణమూల్ కార్యకర్తలపై దాడిని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని ఆమె పేర్కొన్నారు. కేంద్ర హోంమంత్రి మద్దతు లేకుండా ఇలాంటి దాడులు జరిగే అవకాశం లేదని మమతా బెనర్జీ వ్యాఖ్యానించారు. మరోవైపు త్రిపురలో బీజేపీ గూండాల నిజస్వరూపం ఈ దాడులతో బయటపడిందని ఎంపీ అభిషేక్ బెనర్జీ అన్నారు. త్రిపురలో గూండా సర్కార్‌కు ఇది నిదర్శనమని ఎద్దేవా చేశారు. కాషాయ పార్టీ కుట్రలు, కుతంత్రాలకు తృణమూల్ కాంగ్రెస్ బెదిరిపోదని స్పష్టం చేశారు.

# చేర్యాలలో రూ. కోటి 25 లక్షలతో అంబేద్కర్ భవనం : మంత్రి హరీష్ రావు



సిద్దిపేట, ఆగష్టు 9: : చేర్యాలలో రూ. కోటి 25 లక్షలతో అన్ని హంగులతో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కమ్యూనిటీ భవననీ నిర్మిస్తామని ఆర్థిక మంత్రి హరీష్ రావు తెలిపారు. ఇవాళ అంబేద్కర్ కమ్యూనిటీ భవనానికి మంత్రి భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రజా పరిషత్ చైర్ పర్సన్ రోజా రాధాకృష్ణ శర్మ, ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డితో పాటు పలువురు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మంత్రి హరీష్ రావు మాట్లాడుతూ.. ఇప్పటికే ఈ భవన నిర్మాణానికి రూ. 50 లక్షలను మంజూరు చేశామన్నారు. మరో రూ. 75 లక్షలు మంజూరు చేసి.. మొత్తంగా రూ. కోటి 25 లక్షలతో అన్ని హంగులతో భవనం నిర్మిస్తామని మంత్రి చెప్పారు. రెండున్నరేళ్లలో తెలంగాణలో దళితుల అభివృద్ధికి లక్ష కోట్ల రూపాయాలు ఖర్చు చేస్తామని స్పష్టం చేశారు. అన్ని వర్గాల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు.

వచ్చే సంవత్సరం దళిత బంధు కింద బడ్జెట్ లో రూ.30 వేల కోట్లు కేటాయించాలని ఆర్థిక శాఖను ఆదేశించామని తెలిపారు. దళితులందరూ ఈ నిధులను సద్వినియోగం చేసుకోవాలని మంత్రి సూచించారు. రైతు బంధు మాదిరే దళిత బంధు దేశానికే ఆదర్శంగా నిలుస్తుందన్నారు. ఇతర పథకాలను అమలు చేసిన స్ఫూర్తితో దళిత బంధును అమలు చేసి తీరుతామని హరీష్ రావు స్పష్టం చేశారు.

# జూలై నెలలో పెరిగిన వాహనాల డిమాండ్

న్యూఢిల్లీ, ఆగష్టు 9: సొంత కారు, బైకును కొనుక్కోవాలని సాధారణంగా ప్రతి ఒక్కరూ కోరుకుంటుంటారు. ఈ కోరికలే కార్ల విక్రయాలు పెరిగేందుకు దోహదపడుతున్నాయి. గత నెలలో వాహనాల అమ్మకాలు (ఎవప్త్రతిఇశ్రీవబ బజీశ్రీవబ) అమాంతం పెరిగిపోయాయి. ముఖ్యంగా కమర్షియల్ వాహనాలు ఎక్కువగా అమ్ముడుపోయాయి. జూలై నెలలో ప్యాసింజర్ వాహనాలు, ద్విచక్ర వాహనాలతోపాటు అన్ని విభాగాల్లో గణనీయమైన పెరుగుదల కనిపించింది. అలాగే, వాహనాల రిజిస్ట్రేషన్లలో వార్షిక ప్రాతిపదికన 34.12 శాతం పెరుగుదల ఉన్నది. గత నెలలో దేశవ్యాప్తంగా మొత్తం 15,56,777 వాహనాలు అమ్ముడవగా.. గత ఏడాది ఇదే నెలలో 11,60,721 యూనిట్లుగా ఉన్నది.

ఫెడరేషన్ ఆఫ్ ఆటోమొబైల్ డీలర్స్ అసోసియేషన్ (ఎఫ్ఏడీఏ) తెలిపిన వివరాల ప్రకారం, గత నెలల కమర్షియల్ వాహనాలు 52,130 అమ్ముడుపోయాయి. ఇది వార్షిక ప్రాతిపదికన 165.94 శాతం పెరుగుదలగా ఉన్నది. గత ఏడాది ఇదే నెలలో ఈ సంఖ్య 19,602 గా ఉన్నది. అయితే, 2019 జూలై నెల అమ్మకాలతో పోలిస్తే ఇది 24.84 శాతం తక్కువ. రెండేండ్ల క్రితం ఈ క్యాటగిరిలో 69,361 వాహనాల అమ్మకాలు జరిగాయి. మూడు చక్రాల వాహనాల అమ్మకాల్లో కూడా వృద్ధి నమోదైంది. జూలై నెలలో 83 శాతం కంటే ఎక్కువ వృద్ధి కనిపించింది. గత నెలలో మొత్తం 27,904 వాహనాలతో 83.05 శాతం వార్షిక వృద్ధి నమోదైంది. 2020 జూలైలో ఈ సంఖ్య 15,244. రెండేండ్ల క్రితంతో పోలిస్తే ఆటోల అమ్మకాలు సగానికి తక్కువగా ఉన్నాయి. జూలై 2019 లో 58,943 యూనిట్ల ఆటోలు నమోదయ్యాయి.

జూలై నెలలో టూ వీలర్స్ కొనుగోలులో కూడా విపరీతమైన పెరుగుదల ఉన్నది. 2021 జూలైలో 11,32,611 బైకులు నమోదవగా.. గత సంవత్సరం ఇదే నెలలో 8,87,937 యూనిట్లుగా ఉన్నది. అంటే, బైకుల అమ్మకాల్లో 27.56 శాతం పెరుగుదల కనిపించింది. అయితే, ట్రాక్టర్ల కొనుగోళ్లు మందకొడిగా సాగుతున్నాయి. గత నెలలో 82,388 యూనిట్లుగా ఉండగా, గత ఏడాది ఇదే నెలలో 77,257. జూన్ నెలలో 14 శాతం వార్షిక వృద్ధి ఉండగా, జూలైలో అది 6.64 శాతానికి పరిమితమైంది.

# కాస్త ఊరట..స్వల్పంగా తగ్గిన కరోనా కేసులు

అమరావతి, ఆగష్టు 9: ఏపీలో కరోనా మహమ్మరి ఉధృతి కొనసాగుతోంది. గడిచిన 24 గంటల్లో కొత్తగా 1413 కరోనా కేసులు నమోదయ్యాయి. దీంతో ఏపీలో మొత్తం పాజిటివ్ కేసుల సంఖ్య 19,80,826 కి చేరింది. 54,455 శాంపిల్స్ పరీక్షించగా.. 1,413 మందికి పాజిటివ్‌గా తేలింది.. మరో 18 మంది కరోనా బాధితులు ప్రాణాలు వదిలారు. ఇక గడిచిన 24 గంటల్లో 1795 మంది బాధితులు కరోనా మహమ్మారి నుంచి కోలుకున్నారు. ఇక ఇప్పటి దాకా కరోనా బారిన పడి డిశ్చార్జ్ అయిన వారి సంఖ్య 19,50,623 లక్షలకు చేరింది. ఇప్పటి దాకా 2, 52, 47, 884 కరోనా పరీక్షలు చేసినట్టు వైద్య ఆరోగ్య శాఖ ప్రకటించింది. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా 19,549 యాక్టివ్ కేసులు ఉన్నట్టు బులెటిన్‌లో పేర్కొంది ఏపీ ప్రభుత్వం.

ఇక కరోనాతో చిత్తూరులో ఐదుగురు, కృష్ణా జిల్లాలో ముగ్గురు, తూర్పు గోదావరి, గుంటూరు, నెల్లూరు, ప్రకాశం జిల్లాలో ఇద్దరు చొప్పున, శ్రీకాకుళం, విశాఖపట్నంలో ఒక్కొక్కరు మరణించారు. ఇక, ఒకేరోజు 1,795 మంది కోవిడ్ బాధితులు పూర్తిస్థాయిలో కోలుకున్నట్టు బులెటిన్‌లో పేర్కొంది సర్కార్.

# అఖిల భారత ఆయుర్వేద సంస్థలో ప్రపంచంలోనే మొట్టమొదటి "బయో బ్యాంక్ ఆఫ్ ఆయుర్వేద" స్థాపనకు పూర్తి సహకారం

న్యూఢిల్లీ, ఆగష్టు 9:కేంద్ర ఆయుష్ శాఖ మంత్రి శ్రీ సర్బానంద సోనోవాల్ మరియు కేంద్ర ఆయుష్ శాఖ సహాయ మంత్రి డాక్టర్ ముంజపారా మహేంద్ర భాయ్ ఆదివారం అఖిల భారత ఆయుర్వేద సంస్థ ను సందర్శించి, బహుళ ప్రయోజన యోగా హాల్ మరియు మినీ ఆడిటోరియం ను ప్రారంభించారు. మంత్రులిద్దరూ అఖిల భారత ఆయుర్వేద సంస్థ పని తీరును ఎంతో ప్రశంసించారు. ప్రపంచంలోనే అత్యుత్తమ ఆయుర్వేద సంస్థ గా తీర్చిదిద్ది, సంస్థ మరింతగా అభివృద్ధి చెందడానికి తమ పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. శ్రీ సర్బానంద సోనోవాల్, సంస్థ భవిష్యత్ ప్రణాళిక ను ప్రశంసిస్తూ, ఆయుర్వేదంలో ప్రపంచంలోనే మొట్టమొదటి బయో బ్యాంక్ ను ఏ.ఐ.ఐ.ఏ. లో స్థాపించడానికి పూర్తి సహాయం అందిస్తామని కూడా హామీ ఇచ్చారు.

మంత్రులిద్దరూ, ఏ.ఐ.ఐ.ఏ. లో వివిధ సౌకర్యాల ను సందర్శించి, సంస్థ విశిష్టతలను తెలుసుకోవడంలో ఆసక్తి కనబరిచారు. శ్రీ సర్బానంద ఈ సందర్భంగా మాట్లాడుతూ, సంస్థలో శాస్త్రీయ పరిశోధనలను మరింత తీవ్రతరం చేయడంతో పాటు, వారి భాషలో విజయవంతమైన పరిశోధన ప్రజలకు చేరేలా చూడాలని, ఎ.ఐ.ఐ.ఎ. డైరెక్టర్, ప్రొఫెసర్ డాక్టర్ తనూజ నేసారి కి, సూచించారు. ఏ.ఐ.ఐ.ఏ. లో అమలు చేస్తున్న ఆరోగ్యకరమైన చికిత్సా విధానాన్ని, సహాయ మంత్రి డా. ముంజపార మహేంద్ర భాయ్ ప్రశంసిస్తూ, సమగ్రమైన, సంపూర్ణ చికిత్స పై దృష్టి పెట్టాలని సూచించారు.

ఇద్దరు మంత్రులూ కలిసి, దాదాపు అన్ని ప్రధాన విభాగాలు సందర్శించారు. సంస్థ లో కొనసాగుతున్న చికిత్స, పరిశోధన సౌకర్యాలపై అధ్యాపకులు, విద్యార్థులతో వివరంగా సంభాషించారు. పిల్లల కోసం మరియు నేత్రాల కోసం ఏ.ఐ.ఐ.ఏ. అమలు చేస్తున్న పంచకర్మ అనే విశిష్ట వైద్య విధానాన్ని, మంత్రులిద్దరూ ప్రత్యేకంగా ప్రశంసించారు. ఆయుర్వేద దంత వైద్య విభాగాన్ని సందర్శించిన తర్వాత మంత్రులు ఆయుర్వేద శస్త్రచికిత్సా సౌకర్యాలను కూడా పరిశీలించారు. రక్త నిధి వద్ద, రోగనిరోధక వ్యాధులు మరియు లుకేమియా వంటి వ్యాధుల పై పరిశోధనలు మరింత లోతుగా చేయాలని, కేంద్ర మంత్రి సూచించారు. ఫార్మకాలజీ ప్రయోగశాల వద్ద, ఆయుర్వేద ఔషధాల నాణ్యతా ప్రమాణాలను పెంచడంలో నిశితంగా పనిచేయాలని కూడా ఆయన సంస్థ కు సూచించారు. ఏ.ఐ.ఐ.ఏ. అమలు చేస్తున్న ఆయుర్వేద మూలికలతో ధూపం వేసే విధానాన్ని కూడా మంత్రులు ప్రశంసించారు.

ఇద్దరు మంత్రులిద్దరూ ప్రధానంగా సామర్థ్యం మరియు ఆచరణాత్మక పరిజ్ఞానంపై దృష్టి కేంద్రీకరించారు. బహుళ ప్రయోజనకర యోగా హాల్ ను ప్రారంభించిన తర్వాత, శ్రీ సోనోవాల్ కొన్ని సంక్లిష్టమైన యోగాసనాలు ప్రదర్శించ వలసిందిగా విద్యార్థులను కోరారు. ఆ తరువాత విద్యార్థుల ప్రదర్శనను ఆయన ప్రశంసించారు.

కోవిడ్ సమయంలో అఖిలభారత ఆయుర్వేద సంస్థ చేపట్టిన శాస్త్రీయ చికిత్సా అధ్యయనాలను తెలియజేసే ఒక లఘు చిత్రాన్ని మంత్రులకు చూపించారు. సంస్థ కార్యక్రమాలతో పాటు, కోవిడ్ ఆరోగ్య కేంద్రం, కోవిడ్ పరీక్షా కేంద్రాల కార్యకలాపాల పట్ల కూడా వారు సంతృప్తి వ్యక్తం చేశారు.

# ఆ ఇద్దరు గద్దె దిగితేనే సామాన్యులకు మేలు : రేవంత్



న్యూఢిల్లీ, ఆగష్టు 9:కాంగ్రెస్ పాలనలో దేశం ప్రపంచ దేశాల ముందు ఒక శక్తివంతమైన దేశంగా నిలబడిందని తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్ దేశానికి స్వాతంత్ర్యం తీసుకొచ్చి స్వేచ్ఛ వాయువులని ఇచ్చిందన్నారు. మోదీ పాలనలో దేశాన్ని అదానీ, అంబానీలకు తాకట్టు పెట్టారని మండిపడ్డారు.

వ్యవసాయ నల్ల చట్టాలను మోదీ తీసుకొచ్చి దేశంలో రైతుల నడ్డి విరుస్తున్నారన్నారు. పెట్రో ధరలు పెంచుతూ మోదీ సర్కార్ దేశంలో సామాన్యుల నడ్డి విరుస్తోందని రేవంత్ పేర్కొన్నారు. తెల్లదొరల ఫాసిస్ట్ విధానాలని దేశంలో నరేంద్ర మోదీ.. రాష్ట్రంలో కేసీఆర్ అమలు చేస్తున్నారని దుయ్యబట్టారు. మోదీ కేసీఆర్‌ల ఫాసిస్ట్ విధానాలని వ్యతిరేకించాల్సిన బాధ్యత ప్రతి ఒక్క పౌరుడిపై ఉందన్నారు. తెలంగాణలో బడుగు బలహీన వర్గాల ఆశయాలు నెరవేరాలని సోనియా తెలంగాణ ఇచ్చారని చెప్పారు. కేసీఆర్ పాలనలో బలహీన వర్గాల ఆశయాలు అమలు కావడం లేదన్నారు. దేశంలో సామాన్య ప్రజలకు మేలు జరుగుతుందని మోదీ.. రాష్ట్రంలో కేసీఆర్ గద్ద దిగితేనే రేవంత్ పేర్కొన్నారు.

# 'క్విట్ ఇండియా ఉద్యమం'పై ఎగ్జిబిషన్! 'ఆజాదీ కా అమృత్ మహోత్సవ్' వేడుకల్లో భాగంగా ప్రారంభం.



న్యూఢిల్లీ, ఆగష్టు 9:'క్విట్ ఇండియా ఉద్యమం' 79వ వార్షికోత్సవం సందర్భంగా న్యూఢిల్లీలోని భారత జాతీయ అభిలేఖాగారం (ఎన్.ఎ.ఐ.) లో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ ను కేంద్ర సాంస్కృతిక వ్యవహారాలు, ఈశాన్య ప్రాంత అభివృద్ధి శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి 2021 ఆగస్టు 8న ప్రారంభించారు. కేంద్ర సాంస్కృతిక వ్యవహారాల సహాయ మంత్రులు ఆర్జున్ రామ్ మేఘ్వాల్, మీనాక్షీ లేఖి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి 75 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా నిర్వహించుకుంటున్న 'ఆజాదీ కా అమృత్ మహోత్సవ్' కార్యక్రమాల్లో భాగంగా క్విట్ ఇండియాపై ఈ ఎగ్జిబిషన్.ను ఏర్పాటు చేశారు. కేంద్ర సాంస్కృతిక వ్యవహారాల కార్యదర్శి రాఘవేంద్ర సింగ్, ఎన్.ఐ.ఎ. డైరెక్టర్ జనరల్ చందన్ సిన్హా, సాంస్కృతిక వ్యవహారాల అదనపు కార్యదర్శులు రోహిత్ కుమార్ సింగ్, పార్థసారథి సేన్ శర్మ, సంయుక్త కార్యదర్శులు అమితా ప్రసాద్ సర్భాయ్, లిలీ పాండేయ, సాంస్కృతిక వ్యవహారాల మంత్రిత్వ శాఖ, ఎన్.ఐ.ఎ.లకు చెందిన ఇతర అధికారులు కూడా ప్రారంభోత్సవంలో పాలుపంచుకున్నారు.

దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో క్విట్ ఇండియా ఉద్యమ ప్రాముఖ్యాన్ని తెలియజెప్పేందుకు ఈ ఎగ్జిబిషన్ ద్వారా చక్కని ప్రయత్నం జరిగింది. ప్రభుత్వ రికార్డులు, ప్రైవేటు లేఖలు, రేఖా చిత్రాలు, ఫోటో గ్రాఫులు, తదితర అంశాలతో ఈ ఎగ్జిబిషన్ ఏర్పాటైంది. 2021 ఆగస్టు 9నుంచి నవంబరు 8వరకూ ఈ ఎగ్జిబిషన్ సందర్శించేందుకు ప్రజలను అనుమతిస్తారు. ప్రతి రోజూ ఉదయం 10గంటలనుంచి సాయంత్రం ఐదున్నర వరకూ ఎగ్జిబిషన్ తెరిచి ఉంటుంది.

ఎగ్జిబిషన్.ను సందర్శించిన అనంతరం కేంద్రమంత్రి కిషన్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ, సమైక్యత, ప్రజాబలం, దృఢదీక్ష వంటి సువర్ణాధ్యాయాలతో మన స్వాతంత్ర్య పోరాటం మమేకం అయిందని, స్వాతంత్ర్య పోరాటంలో క్విట్ ఇండియా ఉద్యమం కూడా ఒక సువర్ణ అధ్యాయమేనని అన్నారు. దాదాపు 8 దశాబ్దాల తర్వాత కూడా ప్రజల సమైక్య బలానికి అద్భుతమైన ఉదాహరణగా క్విట్ ఇండియా ఉద్యమం నిలిచిందని, రానున్న మరిన్ని దశాబ్దాలకు ఈ ఉద్యమం ఇలాగా నిలిచి ఉంటుందని ఆయన అన్నారు.

75వ స్వాతంత్ర్య వార్షికోత్సవం సందర్భంగా ఆజాదీ కా అమృత్ మహోత్స్ పేరిట భారతదేశం నిర్వహించుకుంటున్న పలు కార్యక్రమాలను గురించి కేంద్రమంత్రి వివరించారు. ఈ ఏడాది మార్చిలో ఈ కార్యక్రమాలు మొదలయ్యాయని, 75వ స్వాతంత్ర్య వార్షికోత్సవ వేడుకలకు 75 వారాలపాటు కౌంట్ డౌన్ 2023 ఆగష్టు 15వ తేదీన ముగుస్తుందని అన్నారు. "వలస పాలననుంచి మన జాతి విముక్తికోసం సేవలందించిన ఒక తరాన్ని గుర్తుంచుకోవడానికేకాక, మన నాగరకతను, వారసత్వ సంపదను 750 సంవత్సరాలు కాపాడటంలో ప్రముఖ పాత్ర పోషించిన వారి సేవలను స్మరించుకోవడానికి ఇది సరైన సందర్భం. భరతమాతకు స్వార్థరహితంగా సేవలందించిన ఎందరెందరో వీరుల త్యాగాలను మనం గుర్తుంచుకోవలసిన అవసరం ఉంది." అని ఆయన అన్నారు.

75వ స్వాతంత్ర్య వార్షికోత్సవం నిర్వహించుకుంటున్న క్రమంలోనే సమైక్యత, స్వేచ్ఛ వంటి భావనలను స్మరించుకునేందుకు ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ వేడుకలు దోహదపడతాయని కిషన్ రెడ్డి అన్నారు. మనమంతా ఒక్కటే అన్న సందేశాన్ని, యువత భాగస్వామ్యంతో దేశాన్ని 25ఏళ్లలో ముందుకు తీసుకెళ్లాలన్న ప్రధానమంత్రి దార్శనికతను ప్రచారం చేసేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను, కార్యక్రమాలకు మీడియా మద్దతు ఇవ్వాలని ఆయన విజ్ఞప్తి చేశారు. "భారతదేశం 2047వ సంవత్సరానికల్లా ఎలా ఉండాలన్న ముందుచూపును యువతలో పురికొల్పడంతో ఈ వేడుకలు కీలకపాత్ర పోషిస్తాయని ప్రధానమంత్రి తరచుగా పేర్కొంటూ ఉంటారు." అని కిషన్ రెడ్డి అన్నారు.

ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ వేడుకల్లో ప్రజలంతా పాల్గొనాలని, దీన్ని ప్రజా ఉత్సవంగా, జనం పర్వదినంగా విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. "ఆజాదీగా అమృత్ మహోత్సవ్ అనేది కేవలం ప్రభుత్వ ఉత్సవం మాత్రమే కాదు. ఈ వేడుకల్లో ప్రతి భారతీయుడూ పాలుపంచుకోవాలి. ఈ ఉత్సవాలను దిగ్విజయం చేసేందుకు అన్ని మతాలు, అన్ని భాషలు, అన్ని రాజకీయవర్గాలకు చెందిన వారు ఈ మహోత్సవంలో పాల్గొంటారు.", అని ఆయన అన్నారు.

అంతకు ముందు,.. ఎగ్జిబిషన్ ప్రారంభించిన వెంటనే సందర్శకుల పుస్తకంలో మంత్రి తన సంతకం చేశారు. "క్విట్ ఇండియా అనే ఉద్యమం జరిగి 79ఏళ్లు పూర్తవుతున్న తరుణంలో కూడా ఈ ఉద్యమ రూపం ఇప్పటికీ మనకు అనుసరణీయమే. 1942లో మహాత్మా గాంధీ చేపట్టిన క్విట్ ఇండియా ఉద్యమం వలసరాజ్య శక్తులను తరిమికొట్టింది. ఇప్పటి నవభారతంలో కూడా పేదరికం, అసమానతలు, నిరక్షరాస్యత, బహిరంగ మల విసర్జన, ఉగ్రవాదం, వివక్ష వంటి సమస్యలను తరిమికొట్టాల్సిందే. అంటే క్విట్ ఇండియా అంటూ ఈ దురాచారాలను మనం తరిమివేయాల్సిందే." అని ఆయన సందర్శకుల రిజిస్టర్.లో రాశారు.

జనగణమన జాతీయ గీతాన్ని ప్రతి ఒక్కరూ ఆలపించి, అలా చిత్రీకరించిన వీడియోలను www.rashtragaan.in అనే వెబ్ సైట్.లో అప్.లోడ్ చేయాలని కేంద్రమంత్రులు విజ్ఞప్తి చేశారు. " 'ఆజాదీ కా అమృత్ మహోత్సవ్' వేడుకల్లో భాగంగా ప్రజల భాగస్వామ్యంతో రాష్ట్రగాన్ పేరిట ఒక ఉద్యమాన్ని కేంద్ర సాంస్కృతిక వ్యవహారాల మంత్రిత్వ శాఖ తొలిసారిగా నిర్వహిస్తోందని చెప్పడానికి ఎంతో సంతోషిస్తున్నాను. ఈ ఉద్యమంలో భాగంగా, ఎవరైనా సరే,. జాతీయ గీతం ఆలపించి, సదరు వీడియో రికార్డింగ్.ను rashtragaan.in అనే వెబ్.సైట్ లో పొందుపరచవచ్చు. అలా పొందుపరిన వీడియోలన్నింటినీ సంకలనంచేసి, స్వాతంత్ర్య దినోత్సవం రోజున టెలివిజన్ ద్వారా ప్రసారం చేస్తారు. ప్రజలను సమైక్యపరిచే ఈ వినూత్న కార్యక్రమంలో మీరంతా భాగస్వాములు కావాలని కోరుకుంటున్నాను. జాతీయ గీతాలాపనకు సంబంధించిన వీడియో రికార్డింగ్.ను www.rashtragaan.in పోర్టల్.లో పొందుపరచండి.", అని కేంద్రమంత్రి విజ్ఞప్తి చేశారు.#MeraMaanMeraRashtragaan pic.twitter.com/JsZActP8pU ద్వారా కూడా జాతీయ గీతాలాపనలో పాలుపంచుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. కేంద్రమంత్రులు కూడా ఈ సందర్భంగా జాతీయ గీతాన్ని ఆలపించి తమ జాతీయ గీతాలాపన వీడియోలను https://t.co/9rJpz90Brc లో అప్ లోడ్ చేశారు.

ఈ ఎగ్జిబిషన్ కు సంబంధించిన స్వాతంత్ర్యోద్యమ చారిత్రాత్మక సంఘటలను కేంద్రమంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ వివరించారు. జాతిపిత మహాత్మా గాంధీతోపాటుగా ఇతర సీనియర్ నాయకులు అరెస్ట్ కావడంతో క్విట్ ఇండియా ఉద్యమం దానంతట అదే దేశం నలుచెరగులూ వ్యాపించిందన్నారు. అప్పట్లో ఈ ఉద్యమ నాయకత్వం రామన్ మనోరహ్ లోహియా, అరుణా అసఫ్ అలీ, జయప్రకాశ్ నారాయణ తదితర యువనేతల చేతుల్లోకి వెళ్లిందన్నారు. 1942వ సంవత్సరంలో వారీ సవాలును తమ నాయకత్వ పటిమతో ఎదుర్కొన్నారని, ప్రజా భాగస్వామ్యంతో ఈ సవాలును ఒక అవకాశంగా మలుచుకున్నారని. బ్రిటిష్ వారు దేశాన్ని వదలివెళ్లేలా చేశారని చెప్పారు. స్వాతంత్ర్యోద్యమ ఘట్టాలతో ఈ ఎగ్జిబిషన్ ను నిర్వహిస్తున్న జాతీయ అభిలేఖాగార సిబ్బంది కృషి ఎంతో అభినందనీయమని కేంద్రమంత్రి మేఘ్వాల్ అన్నారు.

మరో మంత్రి మీనాక్షీ లేఖి మాట్లాడుతూ, భారతీయ స్వాతంత్ర్యోద్యమంలో క్విట్ ఇండియా ఉద్యమం ముఖ్యమైన మైలురాయి అని, మహాత్మా గాంధీ నాయకత్వంలో దేశ ప్రజలంతా ఒక్క తాటిపైకి వచ్చి సామ్రాజ్య వాదాన్ని కుప్పకూల్చారని అన్నారు. బ్రిటిష్ పాలకులను దేశంనుంచి తరిమివేయడానికి 1942లో క్విట్ ఇండియా ఉద్యమం రోజున గాంధీ 'డూ ఆర్ డై' అన్న నినాదాన్ని దేశ ప్రజలందరికీ అందించారని అన్నారు. సామాన్య ప్రజలు ఈ ఉద్యమంలో పాల్గొన్నప్పుడే మనం స్వాంత్ర్యం సాధించుకున్నాం. స్వాతంత్ర్యం కోసం దేశవాసులు ఎన్ని త్యాగాలు చేశారో ప్రస్తుత యువత, రానున్న తరాలవారు తెలుసుకునేందుకే స్వాతంత్ర్యోద్యమ స్ఫూర్తిని ప్రధానంగా ప్రస్తావిస్తున్నామని అన్నారు.

క్విట్ ఇండియా ఉద్యమానికి దారితీసిన పలు సంఘటలను వివరించేలా అనేక విభాగాలను ఈ ఎగ్జిబిషన్ లో ఏర్పాటు చేశారు. క్విట్ ఇండియా పోరాటం ప్రజా ఉద్యమంగా రూపుదాల్చిన వైనం, ఉద్యమ వీరుల వివరాలు, క్షేత్రస్థాయిలో ఉద్యమ ప్రభావం, వలస పాలకుల అరాచకాలు, వాటి పర్యవసానాలు తదితర అంశాలతో ఈ విభాగాలను తీర్చిదిద్దారు.

భారతదేశంలో బ్రిటన్ పాలనకు చరమగీతం పాడాలని కోరుతూ, మహాత్మా గాంధీ 1942వ సంవత్సరం రెండవ ప్రపంచ యుద్ధ సమయంలో క్విట్ ఇండియా ఉద్యమాన్ని ప్రారంభించారు. 1942, ఆగష్టు 8వ తేదీన ఆయన ఈ ఉద్యమానికి పిలుపునిచ్చారు.

క్విట్ ఇండియా ఉద్యమంపై దివంగత మాజీ ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజ్.పేయి రాసిన కవితను ప్రదర్శించిన చోట కేంద్రమంత్రులు, ఇతర ప్రముఖులు ఎక్కువ సేపు గడిపారు. మదన్ మోహన్ మాళవీయ ప్రచురించిన అభ్యుదయ అనే వార్తాపత్రికలో 1946లో వాజ్.పేయి కవిత ప్రచురితమైంది.

భారత స్వాతంత్ర్యోద్యమ చరిత్రలో క్విట్ ఇండియా ఉద్యమం ఎంతో కీలకమైన ఘట్టం. భారతదేశాన్ని ఇకపై పరిపాలించడం తమకు సాధ్యంకాదని ఈ ఉద్యమం బ్రిటిష్ పాలకులకు తెలియజెప్పింది. భారతదేశాన్ని వదలి వెళ్ళే మార్గాలను గురించి వారిని ఆలోచింప జేసింది. "బ్రిటిష్ వారు క్రమబద్ధంగా భారతదేశంనుంచి వెళ్లిపోయేందుకు" వీలుగా మహాత్మా గాంధీ బోధించిన అహింసాయుత పద్ధతిలో క్విట్ ఇండియా ప్రజాఉద్యమం ప్రారంభమైంది. ఈ ఉద్యమంలో గాంధీజీ తన ప్రసంగాల ద్వారా ప్రజలను ఉత్తేజితులను చేశారు. "స్వాతంత్ర్యం కావాలని కోరుకొంటూ, దానికోసం పోరాడే ప్రతి భారతీయుడూ తనకు తానే మార్గదర్శకత్వం వహించుకోవాలి.?"అని ఆయన పిలుపునిచ్చారు. 1942 ఆగష్టు 8వ తేదీన ఉద్యమాన్ని ప్రారంభించినపుడు "సాధించు లేదా మరణించు" అన్న స్ఫూర్తిదాయకమైన నినాదాన్ని గాంధీజీ ప్రకటించారు. "తనకు తానే స్వేచ్ఛాజీవిగా ప్రతి భారతీయుడూ పరిగణించుకోవాలి" అంటూ గాంధీ తన ప్రసంగంలో ప్రజలకు పిలుపునిచ్చారు.

# పలు అభివృద్ధి పనులను ప్రారంభించిన ఎమ్మెల్సీ కవిత



నిజామాబాద్, ఆగష్టు 9:: జిల్లా పర్యటనలో భాగంగా ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. కాలూర్ శివాలయ ప్రాంగణంలో ఎమ్మెల్సీ కవిత మొక్కలు నాటారు. అనంతరం మినీ ట్యాంక్‌బండ్ నిర్మాణానికి నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌తో కలిసి భూమి పూజ చేశారు.

అలాగే నిజామాబాద్ కార్పొరేషన్ పరిధిలోని గంగస్థాన్ ఫేజ్–2కాలనీలో పట్టణ ప్రకృతి వనానికి ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ గారితో కలిసి భూమి పూజ చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ వీజీ గౌడ్, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు ఉన్నారు.

# పప్పూ.. నికమ్మ.. చోర్.. ఇలాంటి పదాలను అసెంబ్లీలో వాడొద్దు

న్యూఢిల్లీ, ఆగష్టు 9: మధ్యప్రదేశ్ వర్షాకాల అసెంబ్లీ సమావేశాలు ప్రారంభంకానున్నాయి. ఈ నేపథ్యంలో ఆ రాష్ట్ర సీఎం శివరాజ్ సింగ్ చౌహాన్ ఆదివారం ఓ పుస్తకాన్ని రిలీజ్ చేశారు. శాసనసభలో మాట్లాడుతున్న సమయంలో కొన్ని నిషేధిత పదాలను ఆ పుస్తకంలో చేర్చారు. పప్పూ, బంటేదార్, ధోంగీ లాంటి అనుచిత పదాలను సభలో మాట్లాడుతున్న సమయంలో వినియోగించరాదు అని సీఎం అన్నారు. సుమారు 1110 నిషేధిత పదాలను ఆ పుస్తకంలో పొందుపరిచారు. 38 పేజీల ఆ బుక్‌లెట్‌ను హిందీలో రిలీజ్ చేశారు. ధోంగీ(మోసగాడు), నికమ్మ(విలువలేని), చోర్(దొంగ), బ్రష్ట్(అవినీతి), తానాషా(నియంత), గుండే( గుండాలు), జూటే బోల్నా( అబద్ధాలు చెబుతున్నాడు), వ్యభిచార్ కర్నా (వ్యభిచారం) లాంటి పదాలను ఇక నుంచి అసెంబ్లీలో మాట్లాడుతున్న సమయంలో వాడరాదు. నిషేధిత పదాలతో పుస్తకం రూపొందించిన అసెంబ్లీని సీఎం శివరాజ్ సింగ్ చౌహాన్ ప్రశంసించారు.

# చిత్తూరు జిల్లాలో విషాదం.. కరెంట్ షాక్‌తో ముగ్గురు మృతి

చిత్తూరు ,ఆగష్టు 9:చిత్తూరు జిల్లా గంగాధర నెల్లూరులో విషాదం నెలకొంది. పాలసముద్రం మండలం కన్యకాపురంలో ఇంటి నిర్మాణం కోసం కంకరలోడ్‌ను టిప్పర్ లిఫ్ట్ చేస్తుండగా హైటెన్షన్ వైరు టిప్పర్ బాడీకి తగిలింది. ఈ ప్రమాదంలో ముగ్గురు అక్కడికక్కడే మరణించారు. మృతుల్లో టిప్పర్ డ్రైవర్ మనోజ్ కుమార్ (25), దొరబాబు (21), జ్యోతిష్ (19) ఉన్నారు. డ్రైవర్‌ను కాపాడేందుకు వెళ్లగా దొరబాబు, జ్యోతిష్ కూడా మరణించినట్లు తెలుస్తోంది. కాగా మృతులందరూ ఒకే గ్రామానికి చెందినవాళ్లుగా పోలీసులు గుర్తించారు. కాగా ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

# ఆగస్ట్ 25 నుంచి స్కూల్స్ రీఓపెన్!

బెంగళూర్, ఆగష్టు 9:: కర్నాటకలో ఈనెల 25 నుంచి స్కూల్స్ పున:ప్రారంభించాలని రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బీసీ నగేష్ ఆదేశించారు. 9, 10, 11వ తరగతి విద్యార్థులకు తరగతులు నిర్వహించాలని పేర్కొన్నారు. స్కూల్స్ రీఓపెన్‌కు సంబంధించి నిర్దిష్ట మార్గదర్శకాలను మంగళవారం జారీ చేస్తామని మంత్రి వెల్లడించారు. అందరి ఆరోగ్యం, భద్రత దృష్ట్యా ప్రతిఒక్కరూ కొవిడ్–19 ప్రొటోకాల్‌ను విధిగా పాటించాలని కోరారు. మంత్రులు, విద్యావేత్తలు, ఉన్నతాధికారులతో సీఎం ఇటీవల నిర్వహించిన సమావేశంలో స్కూల్స్ రీఓపెన్‌పై నిర్ణయం తీసుకున్నారు.

తరగతులను బ్యాచ్‌ల వారీగా రోజు మార్చి రోజు నిర్వహించాలని నిర్ణయించారు. గతంలో ఆగస్ట్ 23 నుంచి స్కూల్స్ పున:ప్రారంభమవుతాయని కర్నాటక ప్రభుత్వం ప్రకటించగా తాజాగా 25 నుంచి స్కూల్స్ రీఓపెన్ ఉంటుందని వెల్లడించారు. స్కూల్స్ రీఓపెన్ సందర్భంగా ప్రతిఒక్కరూ విధిగా మాస్క్ ధరించాలని, భౌతిక దూరం పాటించాలని నిబంధనలను ఉల్లంఘించిన వారిపై చర్యలు చేపడతామని విద్యా శాఖ మంత్రి పేర్కొన్నారు.

# చెంచు గిరిజనులతో మంత్రి శ్రీనివాస్ గౌడ్ సహపంక్తి భోజనం

మహబూబ్‌నగర్, ఆగష్టు 9:ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకల్లో రాష్ట్ర ఎక్సైజ్, స్పోర్ట్స్, టూరిజం శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు. ఈ వేడుకలను పురస్కరించుకుని జిల్లాలోని హన్వాడ మండలం యర్రోనిపల్లి గ్రామంలో చెంచు గిరిజనుల కోసం రూ. 1 కోటి 27 లక్షల రూపాయలతో 24 డబుల్ బెడ్రూం ఇండ్ల నిర్మాణం కొరకు మంత్రి శ్రీనివాస్ గౌడ్ భూమి పూజ చేశారు.

ఈ సందర్భంగా చెంచు సోదరీమణులతో కలిసి మంత్రి శ్రీనివాస్ గౌడ్ సహపంక్తి భోజనం చేశారు. చెంచు గిరిజనుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని మంత్రి స్పష్టం చేశారు.



# ప్రతి ఉపాధ్యాయుడు నిత్య విద్యార్థే : మంత్రి నిరంజన్ రెడ్డి




వనపర్తి, ఆగష్టు 9: ప్రతి ఉపాధ్యాయుడు నిత్య విద్యార్థే అని వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్ రెడ్డి అన్నారు.వనపర్తి జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో రాష్ట్రంలో మొదటి డిజిటల్, కంప్యూటర్ ఎయిడెడ్ ఆన్ లైన్ బోర్డును లాంఛనంగా ప్రారంభించి మంత్రి మాట్లాడారు. భావి భారత పౌరుల భవిష్యత్ ఉపాధ్యాయుల చేతుల్లోనే ఉంటుందన్నారు. వైద్యరంగం మీద దృష్టి సారించి గతంలో నాలుగు మెడికల్ కళాశాలలు ఏర్పాటు చేయగా, తాజాగా ఏడు నూతన మెడికల్, నర్సింగ్ కళాశాలలు ప్రభుత్వం ప్రకటించిందన్నారు. వచ్చే ఏడాదిలో మెడికల్ కళాశాల తరగతులు ప్రారంభిస్తామన్నారు.

అలాగే నూతనంగా 600 గురుకులాలు ప్రారంభించడంతో పాటు ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థులకు సన్నబియ్యం అన్నం, బాలికలకు హెల్త్ కిట్లు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. వనపర్తి జడ్పీ బాలికల పాఠశాల 8,9,10వ తరగతి విద్యార్థులకు డిజిటల్ పాఠాల నిర్వహణ కోసం కంప్యూటర్, ఇతర పరికరాలు, 3డీ పాఠాల నిర్వహణకు కావాల్సిన సదుపాయాలను మంత్రి కల్పించారు. ఉపాధ్యాయుల అనుభవం, సూచనల ఆధారంగా నియోజకవర్గంలో మరిన్ని పాఠశాలలకు విస్తరిస్తామన్నారు.

# దళిత బంధు స్కీం కాదు ఉద్యమం : మంత్రి కొప్పుల



కరీంనగర్,ఆగష్టు 9: దళిత బంధు ఒక స్కీం కాదు. అది ఒక ఉద్యమం అని సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. సీఎం కేసీఆర్ మహానేత, దళిత జాతి సముద్ధరణకు 'దళితబంధు' తెచ్చి వెలుగులు ప్రసరింపజేస్తున్నారని కొనియాడారు. దళిత బంధును పైలెట్ ప్రాజెక్టుగా హుజూరాబాద్ నియోజకవర్గంలో అమలు పర్చేందుకు రూ.500 కోట్లు విడుదల చేయడంపై కొప్పుల సీఎంకు దళితులందరి పక్షాన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి ఆధ్వర్యంలో జమ్మికుంట గాంధీ చౌరస్తా వద్ద దళితులు పెద్ద సంఖ్యలో హాజరై మిఠాయిలు పంచి, పటాకులు కాల్చారు.

జై తెలంగాణ, జైజై కేసీఆర్ నినాదాలతో హోరెత్తించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. దళిత బంధు ఒక పథకం కాదని, ఉద్యమం అని, దీనిని ముంన్ముందుకు తీసుకుపోతామని సీఎం కేసీఆర్ చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. తరతరాలుగా చీకట్లో మగ్గిన దళితుల జీవితాలలో వెలుగులు నింపేందుకు తెచ్చిన ఇలాంటి పథకం దేశంలో ఇప్పటివరకు లేదన్నారు. దేశ ప్రజలందరూ మరోసారి తెలంగాణ వైపు చూస్తున్నారని మంత్రి పేర్కొన్నారు. కేసీఆర్ ఆలోచనలు, కార్యదీక్ష, సుపరిపాలనను ప్రశంసిస్తున్నారన్నారు.

నిన్నటి దాక అవాకులు, చవాకులు పేలిన బీజేపీ, కాంగ్రెస్ నాయకులకు నోట మాట రావట్లేదన్నారు. ఆ పార్టీలు చాలా రాష్ట్రాలలో అధికారంలో ఉన్నాయి. కానీ, ఏ ఒక్క చోట కూడా ఇటువంటి మహత్తరమైన కార్యక్రమం చేపట్టలేదని మంత్రి స్పష్టం చేశారు. ప్రతిపక్షాలకు ఈ రాష్ట్రంలో ప్రజల కనీస మద్దతు లేదన్నారు. దళితులతో పాటు అన్ని వర్గాలకు చెందిన వాళ్లు కేసీఆర్ నాయకత్వం పట్ల సంపూర్ణ విశ్వాసం వ్యక్తం చేస్తున్నారని మంత్రి పేర్కొన్నారు.

ఈనెల 16 తేదీన జమ్మికుంటలో జరిగే కేసీఆర్ సభకు తరలి వచ్చి జయప్రదం చేయాల్సిందిగా దళితులకు కొప్పుల పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు కోరుకంటి చందర్, నన్నపనేని నరేందర్, పెద్దపల్లి ఎంపీ వెంకటేష్ నేత, మున్సిపల్ చైర్మన్ రాజేశ్వరరావు, మాజీ చైర్మన్ రామస్వామి, టీఆర్ఎస్ పట్టణ శాఖ అధ్యక్షుడు రాజ్ కుమార్, కౌన్సిలర్లు మల్లయ్య, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

# పేదప్రజల సంక్షేమానికే ప్రభుత్వ పథకాలు: పద్మారావు గౌడ్



హైదరాబాద్ , ఆగష్టు 9:అన్నివర్గాల ప్రజలకు ఉపయోగపడే విధంగా అనేక సంక్షేమపథకాలను తెలంగాణప్రభుత్వం అమలు చేస్తుందని డిప్యూటీస్పీకర్ పద్మారావుగౌడ్ అన్నారు. దేశంలో ఎక్కడాలేని విధంగా ప్రజలకోసం అనేక పథకాలను రూపొందించిందని తెలిపారు. సీతాఫల్‌మండిలోని క్యాంపు కార్యాలయంలో రూ. 1కోటీ15 లక్షల విలువచేసే 30 కల్యాణలక్ష్మి, 59 షాదీముబారక్ చెక్కులను, రూ.26 లక్షల విలువచేసే సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆడపిల్లల వివాహాలు తల్లితండ్రులకు భారంగా మారకుండా ఏర్పాట్లు చేసి తెలంగాణ ప్రభుత్వం కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. పేద ప్రజలకు వైద్య సేవలను అందించేందుకు సీఎంఆర్ఎఫ్‌ను సికింద్రాబాద్ నియోజకవర్గంలో పెద్దయెత్తున అమలు జరుపుతున్నామని చెప్పారు.

రానున్న రోజులలో అర్హులైన వారందరికి తెల్లరేషన్ కార్డులు అందిస్తామని తెలిపారు. ప్రభుత్వం అందజేసే పథకాల లబ్ధిదారులు దళారులను ఆశ్రయించకుండా నేరుగా తన కార్యాలయంలో సంప్రదించాలని, ఎవ్వరికి చిల్లిగవ్వ కూడా చెల్లించాల్సిన అవసరం లేదని తెలిపారు. ఎవరైనా ఇందుకోసం డబ్బులు డిమాండ్ చేస్తే నేరుగా తనకు ఫిర్యాదు చేయాలని డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్ సూచించారు.

ఈ కార్యక్రమంలో ముషీరాబాద్, మారేడ్‌పల్లి తాసిల్దార్‌లు జానకీ, సునీల్‌కుమార్, కార్పొరేటర్‌లు, నేతలు కిషోర్ గౌడ్, కిరణ్‌కుమార్ గౌడ్, రామేశ్వర్‌గౌడ్, సత్యనారాయణ గౌడ్, మల్లారి అనీల్, బొగ్గుల కృష్ణ, బాల్‌రాజ్ గౌడ్, ప్రశాంత్ గౌడ్ ఇతర నేతలు పాల్గొన్నారు.

# మిస్డ్ కాల్‌తో ఇండియన్ ఎల్‌పీజీ కనెక్షన్




హైదరాబాద్ , ఆగష్టు 9:ఎల్‌పీజీ కనెక్షన్ పొందాలనుకునే వారికి ఇండియన్ ఆయిల్ మిస్ట్ కాల్ సౌకర్యాన్ని ప్రవేశపెట్టినట్లు ఇండియన్ ఆయిల్ ఛైర్మన్ ఎస్ఎం వైద్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిజిటల్ ఇండియాలో భాగంగా వినియోగదారుల సౌకర్యాలను మెరుగుపరిచే నిరంతర ప్రయత్నానికి అనుగుణంగా ఈ చర్య చేపట్టినట్లు పేర్కొన్నారు. కొత్త కనెక్షన్ పొందడానికి 8454955555 నెంబర్‌కు మిస్డ్ కాల్ ఇవ్వవచ్చున్నారు. ఇండియన్ ఆయిల్ ప్రస్తుత, నూతనంగా వచ్చే వినియోగదారుల కోసం ఈ సదుపాయం కల్పిస్తోన్నట్లు వివరించారు. విస్తృతమైన కస్టమర్ ఇంటర్‌ఫేస్‌లలో నిన్నటి కంటే నేటి అనుభవాన్ని మెరుగుపరచడమే లక్ష్యమన్నారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవడం ద్వారా ఇందన వినియోగదారులకు నిరంతరం సేవలను అందిస్తున్నామని పేర్కొన్నారు. ఎల్‌పీజీని వినియోగదారులకు సులభంగా చేరువ చేయడంలో మిస్డ్ కాల్ సౌకర్యం కీలక పాత్ర పోషిస్తుందన్న నమ్మకం ఉందన్నారు. దేశవ్యాప్తంగా రీఫిల్ బుకింగ్ కోసం మిస్డ్ కాల్ సౌకర్యం, ఎంపిక చేసిన మార్కెట్లలో కొత్త కనెక్షన్లు జనవరి 2021 లో ప్రారంభించామన్నారు. ఈ సౌకర్యం కస్టమర్లకు చాలా సమయాన్ని ఆదా చేస్తోందన్నారు. ఈ సదుపాయంతో కొత్త కనెక్షన్ నమోదు చేసుకోవడానికి ఎలాంటి ఖర్చు ఉండదన్నారు.

ఇది వినియోగదారులకు, ముఖ్యంగా వృద్ధులకు, గ్రామీణ ప్రాంతాల వారికి చాలా ప్రయోజ నదాయకంగా ఉంటుందని తెలిపారు. ఎల్‌పీజీ రీఫిల్స్ బుకింగ్, చెల్లింపు సౌలభ్యాన్ని అందించడానికి ఇండియన్ ఆయిల్ నిరంతరం సాంకేతికతను అందిస్తోందన్నారు. వినియోగదారులు తమ ఎల్‌పీజీ రీఫిల్ కోసం భారత్ బిల్ పేమెంట్ సిస్టమ్, ఇండియన్ ఆయిల్ వన్ యాప్ లేదా పోర్టల్ సీఎక్స్ ద్వారా చేసుకోవచ్చుని పేర్కొన్నారు. తినిటతిజీనినీతిశ్రీ.తిని, కస్టమర్‌లు వాట్సాప్ (7588888824), ఎస్ఎమ్ఎస్ ఐవీఆర్ఎస్(7718955555) లేదా అమెజాన్, పేటీఎం, ఛానెల్‌లలో అలెక్సా ద్వారా కూడా రీఫిల్ కోసం బుక్ చేసుకోవచ్చు, చెల్లించవచ్చున్నారు. డబుల్ బాటిల్ కనెక్షన్ (డీబీసీ) ను కస్టమర్ డోర్‌స్టెప్‌లో ఉపయోగించుకునే సదుపాయాన్ని ప్రారంభించామన్నారు. ఆసక్తి ఉన్న కస్టమర్లు సాధారణ 14.2 కిలోల సిలిండర్‌కు బదులు ఐదు కిలోల సిలిండర్‌ను బ్యాకప్‌గా ఎంచుకోవచ్చుని వివరించారు.

# upGrad Jeet దాని JeetCET: NRA CET ఆధారిత స్కాలర్‌షిప్ టెస్ట్ యొక్క అదనపు స్లాట్




హైదరాబాద్, ఆగష్టు 9: upGrad Jeet ఆసియా యొక్క ఉన్నత ఎడ్టెక్ మేజర్ అప్‌గ్రాడ్ యొక్క 100% అనుబంధ సంస్థ, వార్షిక పోటీ పరీక్షలకు హాజరు కావాలని మరియు ప్రభుత్వ రంగంలో ఉద్యోగాలు పొందాలని యోచిస్తున్న వారి కోసం వారి NRA CET టెస్ట్ స్కాలర్‌షిప్ యొక్క మూడవ స్లాట్‌ను ప్రకటించింది. జీట్‌సెట్, NRA CET టెస్ట్ స్కాలర్‌షిప్ టెస్ట్ ఇటీవల ప్రారంభించబడింది మరియు మొదటి రెండు స్లాట్‌లను ఈ సంవత్సరం జులై 18 మరియు 25 తేదీలలో విజయవంతంగా నిర్వహించారు. మరొక స్లాట్‌ను ప్రవేశపెట్టాలనే నిర్ణయం మొదటి రెండు స్లాట్‌లకు వచ్చిన భారీ స్పందనతో ప్రేరణ పొందింది.

భారతదేశంలో రాబోయే NRA CET (కామన్ ఎలిజిబిలిటీ టెస్ట్) కోసం సిలబస్ మరియు పేపర్ సరళిని ప్రభుత్వం ఇంకా విడుదల చేయలేదు, ఇది కేంద్ర ప్రభుత్వం, ప్రభుత్వ రంగ బ్యాంకులు మరియు భారత రైల్వేలలో నాన్-గెజిటెడ్ పోస్టులకు సిబ్బందిని నియమించడంలో కీలకంగా ఉంటుంది. ఇది క్రమంగా, ఔత్సాహికులకు తగినంత రిఫరెన్స్ మెటీరియల్ లేనందున ఇది పరీక్ష చుట్టూ చాలా గందరగోళానికి దారితీస్తుంది. అందువల్ల, upGrad Jeetదాని ప్రత్యేక మైన విలువ ప్రతిపాదనతో ప్రభుత్వానికి సహాయం చేయడానికి ఒక ఎంట్రీ ఇచ్చింది. ఈ పరీక్ష కోసం దరఖాస్తు చేసుకునే ఉద్యోగార్థులు, విస్తృతమైన పరీక్ష శిక్షణతో ఒక మెట్టుగా, ఇది వారిని ఉపాధి పొందే దగ్గరికి తీసుకువెళుతుంది.

జీట్‌సెట్: NRA CET ఆధారిత స్కాలర్‌షిప్ పరీక్ష, ఔత్సాహికుల మెరుగైన తయారీకి దిశానిర్దాశం చేయడానికి ఊహించిన పరీక్షా సరళిని మరియు సిలబస్‌ను అంచనా వేసే ప్రయత్నం.

# జగన్ సర్కారుపై మరోసారి హైకోర్టు సీరియస్

అమరావతి, ఆగష్టు 9:ఏపీ ప్రభుత్వంపై మరోసారి హైకోర్టు సీరియస్ అయ్యింది. కర్నూలు జిల్లాలోని ఓ పాఠశాల ఆవరణలో గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం నిర్మిస్తున్నారంటూ దాఖలైన పిటిషన్‌పై ఏపీ హైకోర్టు విచారణ జరిపింది. ఈ కేసు విచారణకు నలుగురు ఐఏఎస్‌లు జీకే ద్వివేది, గిరిజాశంకర్, శ్రీలక్ష్మీ, విజయ్ కుమార్ హాజరయ్యారు. ఆ పాఠశాల ఆవరణలో ఇలాంటి భవనాలు నిర్మించవద్దని గతంలో ఆదేశాలు ఇచ్చినప్పటికీ ఎందుకు పాటించడంలేదని ప్రభుత్వంపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది.

ఆదేశాలు అమలు చేయడంలో జాప్యం ఎందుకని ప్రశ్నించింది. తాము ఆదేశించినా నిర్మాణాలు ఎందుకు జరుగుతున్నాయి అని నిలదీసింది. హైకోర్టు ఆదేశాలను సరిగా పాటించడం లేదని ఆ విషయాలను తాము తీవ్రంగా పరిగణిస్తున్నామని పేర్కొంది. దీనిపై పూర్తి స్థాయి విచారణను ఈ నెలాఖరుకు విచారిస్తామని కోర్టు వాయిదా వేసింది. అయితే దీనిపై ఏపీ సర్కార్ ఏ విధంగా స్పందిస్తుందో చూడాలి.

# గోల్డెన్ బాయ్ కి మహీంద్ర సూపర్ గిఫ్ట్

హైదరాబాద్ , ఆగష్టు 9:టోక్యో ఒలింపిక్స్ లో స్వర్ణం సాధించిన యువ అథ్లెట్ నీరజ్ చోప్రాకు దేశీయ ప్రముఖ వాహన తయారీ సంస్థ మహీంద్రా అండ్ మహీంద్ర అదిరిపోయే గిఫ్ట్ ఇవ్వనుంది. నీరజ్ చోప్రాకు మహీంద్రా ఎక్స్‌యూవి700 ఎస్‌యూవిని బహుమతిగా ఇవ్వానున్నట్లు మహీంద్రా గ్రూప్ ఛైర్మన్ ఆనంద్ మహీంద్ర ప్రకటించారు. ఒలింపిక్స్ లో నీరజ్ చోప్రా గోల్డ్ మెడల్ సాధించినందుకు ఆనంద్ మహీంద్రా అభినందనలు తెలిపారు.

కాగా, టోక్యో ఒలింపిక్స్‌లో భారత్‌కి తొలి స్వర్ణ పతకం అందించి చరిత్రలో నిలిచిపోయాడు నీరజ్ చోప్రా. పురుషుల జావెలిన్ త్రో ఫైనల్లో పోటీపడిన నీరజ్ చోప్రా 87.58 మీటర్లతో బంగారు పతకాన్ని గెలుపొందాడు. వంద ఏళ్ల తర్వాత ఒలింపిక్ పతకం సాధించిన భారతీయ అథ్లెట్‌గా రికార్డు సృష్టించాడు. జావెలిన్ త్రోలో ప్రత్యర్థులెవరూ నీరజ్ చోప్రా దరిదాపుల్లోకి కూడా రాలేదు.

మహీంద్రా కంపెనీ ఎక్స్‌యూవి700 ఎస్‌యూవిని లాంచ్ ముందుగానే ప్రచారం చేస్తోంది. ఈ సంవత్సరంలో అత్యంత ఎదురుచూస్తున్న లాంచ్‌లలో ఈ కారు ఒకటి. మహీంద్రా ఈ సంవత్సరం ఆగస్టు 15న ఎక్స్‌యూవి 700ని ప్రపంచవ్యాప్తంగా ఆవిష్కరించనుంది.

# కేంద్ర ప్రభుత్వ రైతు, కార్మికుల వ్యతిరేక విధానాలపై పోరాడుతాం?

హైదరాబాద్ , ఆగష్టు 9:కేంద్ర ప్రభుత్వ రైతు, కార్మికుల వ్యతిరేక విధానాలపై పోరాడుతామని ప్రజా సంఘాల నాయకులు అన్నారు. సోమవారం మల్కాజిగిరి చౌరస్తాలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ప్లకార్డులు, జెండాలతో నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు కృపాసాగర్, మంగ, షేక్‌నజ్మా, లక్ష్మణ్, యాదగిరి, భాస్క

# డబుల్ ఇండ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేసిన మంత్రి శ్రీనివాస్ గౌడ్

మహబూబ్‌నగర్, ఆగష్టు 9: ప్రపంచ ఆదివాసీల దినోత్సవం రోజున చెంచులకు (24) డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల శంకుస్థాపన చేయడం చాలా ఆనందంగా ఉందని ఎక్సైజ్ శాఖ మంత్రి వి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. సోమవారం హన్వాడ మండలం యారోనిపల్లి గ్రామంలో ఆదివాసీల కోసం రూ.120.96 లక్షల వ్యయంతో నిర్మించనున్న 24 డబుల్ బెడ్ రూమ్ ఇండ్లకు శంకుస్థాపన చేసి మంత్రి మాట్లాడారు. ఆదివాసీలు అడవుల్లోనే ఉంటారని, వారు అడవిని వదిలి వెళ్లలేరని అందువల్ల అడవి లాంటి ప్రాంతంలోనే వారికి డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు కట్టించి ఇస్తామన్నారు.

ఇంతకుముందు వారు జనంలో కలిసే వారు కాదని, కానీ ఇప్పుడిప్పుడే వారు జనంలో తిరుగుతున్నారని మంత్రి తెలిపారు. అలాగే వారికి కల్యాణ లక్ష్మి, పింఛన్, రేషన్ బియ్యం వంటి ఎన్నో పథకాలు అందుకుంటున్నారని, త్వరలో మరిన్ని డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు అందిస్తామన్నారు. ఇక్కడే పది ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని దానిలో కూరగాయలు, పండ్లు వంటివి సాగు చేసుకోవచ్చుని వారికి హామీ ఇచ్చారు. సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ కింద పని చేసుకోవాలి అనుకునే వారికి వంద శాతం సబ్సిడీ రుణాలు అందించే దిశగా కృషిచేస్తామని మంత్రి తెలిపారు.

వ్యవసాయానికి ఎండ కాలంలో కూడా నీళ్ల కొరత లేకుండా ఉండటం కోసం త్వరలో జిల్లాలోని ప్రతి గ్రామానికి నీళ్లు వచ్చేలా ఒక ప్రాజెక్ట్ తీసుకువస్తున్నామని పేర్కొన్నారు. ఎవరైనా చెంచుల జోలికి వస్తే ఊరుకునేది లేదని మంత్రి హెచ్చరించారు. ఆదివాసీలు (చెంచులు) తో కలిసి మంత్రి భోజనం చేశారు.

# దూదేకుల నూరుబాష కులస్తులకు మైనార్టీ బంధు ప్రకటించాలి




రాజన్న సిరిసిల్ల, ఆగష్టు 9:(నేటినిజం ప్రతినిధి): దూదేకుల నూరుబాష కులస్తులను మైనార్టీలుగా గుర్తించి మైనార్టీ బంధును ప్రభుత్వం వెంటనే ప్రకటించాలి, అర్హులైన పేద కుటుంబాలకు డబల్ బెడ్ రూమ్ ఇండ్లు మంజూరు చేయాలి, 100 కోట్లతో దూదేకుల నూర్ భాషా కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి తెలంగాణ ముస్లిం దూదేకుల నూర్బాష్ వృత్తి సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మహమ్మద్ సుభాన్ అలిఅన్నారు . సోమవారం జిల్లా కేంద్రంలోని విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దళితుల సాధికారత కోసం సీఎం కేసీఆర్ తీసుకొస్తున్న తెలంగాణ దళిత బంధును స్వాగతిస్తున్నామని అన్నారు. ముఖ్యమంత్రి కెసిఆర్ పెద్ద మనసు చేసుకొని దూదేకుల నూరుబాష సంక్షేమ కోసం కూడా ఆలోచించి మైనార్టీ లుగా గుర్తించి మైనార్టీ బంధును కూడా ప్రకటించాలని కోరారు. తెలంగాణ రాష్ట్రంలో దూదేకుల నూరుబాష కులస్తులు దళితుల కంటే వెనుకబడి ఉన్నారని అన్నారు తెలంగాణ రాష్ట్రంలో 95 శాతం దూదేకుల నూరుబాష కులస్తులు దారిద్ర్య రేఖకుదిగువన జీవనం గడుపుతూ అత్యంత పేదరికంలో కొట్టుమిట్టాడుతున్నారని అన్నారు.వెంటనే పేద దూదేకుల నూర్బాష్ మైనారిటీ బంధు మరియు రాష్ట్ర నూర్బాష్ కార్పొరేషన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు×తొలి విడతగా ఈ ఆర్థిక సంవత్సరంలో రూ. 28000 వేల కోట్లతో దూదేకుల నూరుబాష మైనారిటీ బంధు ప్రకటించాలని, హుజురాబాద్ నియోజకవర్గంలో ఉన్న పేద ముస్లిం దూదేకుల నూరుబాష కుటుంబాలకు పైలెట్ ప్రాజెక్టు కింద ప్రతి కుటుంబానికి రూ. 10 లక్షలు అందించాలని అన్నారు. గత పాలకుల నిర్లక్ష్యంతో 70 సంవత్సరాలు అభివృద్ధికి నోచుకోలేదని, ఎటువంటి ఆర్థిక ఫలాలను అందుకోలేదని, రాష్ట్ర వ్యాప్తంగా దూదేకుల నూరుబాష్ మైనారిటీ బంధు పథకాన్ని అమలు చేసేలా విధివిధానాలు రూపొందించాలని తెలంగాణ రాష్ట్ర దూదేకుల నూరుబాష్ వృత్తి సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి , కరీంనగర్ జిల్లా అధ్యక్షులు మహమ్మద్ రషీద్ దూదేకుల నూరుబాష్ బంధు పథకాన్ని యుద్ధ ప్రాతిపదికన అమలు చేయాలని, 100 కోట్లతో రాష్ట్ర నూర్బాష్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, ఇళ్ళు లేని నిరుపేద దూదేకుల వారికి ప్రత్యేక కోటాలో డబుల్ బెడ్ రూం ఇళ్లను కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ముస్లిం దూదేకుల నూరుబాష వృత్తి సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మహమ్మద్ సుభానిఅలీ , రాష్ట్ర అధికార ప్రతినిధి మహమ్మద్ రషీద్ , రాష్ట్ర పొలిటికల్ కోఆర్డినేటర్ మహమ్మద్ జహంగీర్ , రాష్ట్ర సెక్రటరీ మహమ్మద్ అబ్దుల్ రజాక్ , రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ మహమ్మద్ రహీం , రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు మహమ్మద్ కాసిం , జిల్లా ఉపాధ్యక్షులు మహమ్మద్ మహబూబ్ జిల్లా జనరల్ సెక్రటరీ మహమ్మద్ గౌస్ఉద్దిన్ తదితరులు పాల్గొన్నారు

# కబ్జాకు గురైన వక్ఫ్ భూములను కాపాడాలని రాష్ట్ర వక్ఫ్ బోర్డ్ చైర్మన్ కు వినతి..



రాజన్న సిరిసిల్ల, ఆగష్టు 9:(నేటినిజం ప్రతినిధి): రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ మున్సిపల్ పరిధిలోని తిప్పాపూర్ 41,42,43 సర్వే లో గల కబ్జాకు గురైన వక్ఫ్ భూములను కాపాడాలని కబ్జా చేసిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాల ని సోమవారం వేములవాడ ముస్లింలు హైదరాబాద్ లోని రాష్ట్ర వక్ఫ్ బోర్డ్ చైర్మన్ సలీం ను కలిసి వినతిపత్రం సమర్పించారు

తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించి వక్ఫ్ భూములను కబ్జా చేశారని, అధికారులు పట్టించుకోక పోవడంతో యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని వివరించారు.వక్ఫ్ భూములలో అక్రమాలకు పాల్పడుతున్నారని అధికారులు వెంటనే స్పందించి భూములను పరిశీలించి విచారణ జరిపిన అనంతరం బాధ్యులపై చర్యలు తీసుకోవడంతోపాటు వక్ఫ్ భూములను రక్షించాలని విజ్ఞప్తి చేశారు. దీనికి స్పందించిన రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ సలీం సర్వేలోని 41 42 43 వక్ఫ్ భూములను సర్వే చేయించి కబ్జా చేసిన వ్యక్తుల పై,అక్రమ నిర్మాణం చేస్తున్న వారిపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

# టీఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా కమిటీ ఎన్నిక



రాజన్న సిరిసిల్ల, ఆగష్టు 9:(నేటినిజం ప్రతినిధి): వేములవాడ పట్టణంలో 4వ వార్డ్ , 16వ వార్డు ,18 వ వార్డ్ కౌన్సిలర్ ల సమక్షంలో టిఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షులు పుల్కం రాజు ఆధ్వర్యంలో వేములవాడ పట్టణ టిఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా కమిటీ ని ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన మున్సిపల్ చైర్ పర్సన్ రామతీర్థపు మాధవి రాజు మాట్లాడుతూ టిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు ఎమ్మెల్యే రమేష్ బాబు సూచన మేరకు ప్రతి వార్డు లో 5 నుడి 10 మంది వరకు సోషల్ మీడియా కమిటీ సభ్యులు గా ఎన్నుకోవడం జరుగుతుందని వారు ప్రభుత్వం చేసే పలు అభివృద్ధి పనులు మరియు చేయబోయే అభివృద్ధి పనులు ప్రతి ఒక్క సంక్షేమ పథకం ప్రజలకు తెలిసేలా అలాగే పార్టీ పునర్నిర్మాణంలో భాగంగా చేసే పనులను ప్రతి వార్డు లో ప్రజలందరికీ తెలిసేవిధంగా ఈ సోషల్ మీడియా కమిటీ సభ్యులు పని చేస్తారని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ మధు రాజేందర్ వార్డు కౌన్సిలర్ లు సిరిగిరి రామచంద్రం, మా రం కుమార్, కొండ పావని నర్సయ్య,కొండ కనకయ్య శ్రీలత , కోఆప్షన్ సభ్యులు షేక్ బాబున్ , టిఆర్ఎస్ నాయకులు విజయ్ యాదవ్ ఇబ్రహీం నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# ట్రీట్ మెంట్ కోసం వైజాగ్ కు చిరంజీవి..!

హైదరాబాద్ , ఆగష్టు 9:మెగాస్టార్ చిరంజీవి బ్యాక్ టు బ్యాక్ సినిమాలతో అభిమానులను ఎంటర్ టైన్ చేసేందుకు రెడీ అవుతున్నాడని ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. కొరటాల శివ డైరెక్షన్ లో తెరకెక్కుతున్న ఆచార్య షూటింగ్ దాదాపు పూర్తయినట్టే. మెహర్‌రమేష్, బాబీ సినిమాలతో బిజీ కానున్నాడు. ప్రస్తుతం లూసిఫర్ రీమేక్ షూటింగ్ కోసం ప్రిపరేషన్ మొదలుపెట్టాడు చిరు. ప్రస్తుతం చిరంజీవి వైజాగ్ వెళ్లాడన్న వార్త టాలీవుడ్ లో చక్కర్లు కొడుతోంది. ఇంతకీ చిరు వైజాగ్ కు వెళ్లింది ఎందుకో తెలుసా..? ఆయుర్వేదిక్ ట్రీట్ మెంట్ కోసం వైజాగ్ వెళ్లాడట.

డీటాక్సిఫికేషన్, రెజువెనేషన్ ప్రక్రియలో భాగంగా వైజాగ్ లోని ఆయుర్వేదిక్ స్పా సెంటర్ లో వెళ్లినట్టు టాక్. గతంలోనే చిరు ఇదే స్పా సెంటర్ లో వారంపాటు ఉన్నారు. ఆ సమయంలో నిర్మాత దిల్ రాజు కూడా చిరంజీవి వెంట ఉన్నారట. సాధారణంగా టాలీవుడ్ హీరోలు డీటాక్సిఫికేషన్ ప్రాసెస్ కోసం విదేశాలకు వెళ్తుంటారు. కానీ చిరంజీవి మాత్రం ఈ సారి విదేశాలకు వెళ్లే పని పెట్టుకోకుండా ట్రీట్ మెంట్ కోసం వైజాగ్ నే ఎంచుకున్నాడు.

స్పా సెషన్ పూర్తవగానే లూసిఫర్ రీమేక్ షూటింగ్ మొదలు కానున్నట్టు తెలుస్తోంది. ఈ చిత్రంలో టాలీవుడ్ యువ హీరో సత్యదేవ్ కీలక పాత్రలో నటించబోతున్నాడు. మలయాళ వెర్షన్ లో పృథ్వీరాజ్ సుకుమారన్ పోషించిన పాత్రకు సరిపోయే హీరో కోసం వెతికే పనిలో ఉన్నారు మేకర్స్ అండ్ టీం. మోహన్ రాజా డైరెక్షన్ లో తెరకెక్కనున్న ఈ చిత్రానికి ఎస్ ఎస్ థమన్ మ్యూజిక్ కంపోజర్. మోహన్ లాల్, పృథ్వీరాజ్ సుకుమారన్ కాంబినేషన్ లో వచ్చిన లూసిఫర్ మాలీవుడ్ లో కలెక్షన్ల వర్షం కురిపించిన విషయం తెలిసిందే.

Printed, Published and owned by VEENADAS,at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana.Published at SRT-74,Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas.
**RNI No.52865/93.** E-mail :netinijam93@gmail.com.